


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి బుధవారం 14-12-2022 సంపుటి : 04 సంచిక : 100 పేజీలు : 4 వెల : రూ 3-00


# ముగిసిన ఏపీ కేబినెట్ భేటీ.. పెన్షన్ పెంచుతూ నిర్ణయం

అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఏపీ కేబినెట్ సమావేశం ముగిసింది.మంగళవారం సచివాలయం మొదటి బ్లాకు కేబినెట్ సమావేశ మందిరంలో రాష్ట్ర మంత్రివర్గం సమావేశమైంది.ఈ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధానంగా పెన్షన్ పెంపుపై కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. రూ. 2,500 ఉన్న పెన్షన్‌ను వచ్చే నెల నుంచి రూ. 2,750కి పెన్షన్ పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఫలితంగా 62. 31 లక్షల



మంది పెన్షన్‌దారులకు మేలు జరుగనుంది. జనవరి 1వ తేదీ నుంచి పెంచిన పెన్షన్‌ను అమలు కానుంది.మరొకవైపు వైఎస్సార్ పశుబీమా పథకం ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అన్ని ప్రభుత్వ పాఠశాల్లలో వర్చువల్ క్లాస్‌లు, ఫౌండేషన్ స్కూళ్లలో స్మార్ట్ టీవీ రూమ్‌లను నాడు-నేడు ద్వారా నిర్మించే ప్రతిపాదన?కు కేబినెట్ ఆమోద ముద్రవేసింది.

## 'విద్య'పై ఖర్చు.. రాష్ట్ర అభివృద్ధికి పెట్టుబడి

**విద్యార్థుల్లోని నైపుణ్యాలను గుర్తించి.. ప్రోత్సహించండి**

**కళా ఉత్సవ్ ప్రారంభోత్సవంలో మంత్రి బొత్స సత్యనారాయణ**

, అమరావతి: విద్యా రంగం మీద రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఖర్చు రాష్ట్ర అభివృద్ధికి పెట్టుబడి అని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు.విద్యా శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు విజయవాడలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్-2022ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలని తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను కోరారు.చదువు మాత్రమే కాకుండా కళలు, క్రీడలవైపు కూడా తగిన ప్రోత్సాహం అందించాలని సూచించారు. విద్యా రంగంలో ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాల విజయవంతానికి ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేయాలన్నారు. అనంతరం పలు కళారూపాలను ప్రదర్శించిన చిన్నారులను మంత్రి బొత్స సత్యనారాయణ అభినందించారు. పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సురేష్‌కుమార్, రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా మండలి డైరెక్టర్ బి.ప్రతాపరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కాగా, మొత్తం 10 అంశాలలో 260 మంది విద్యార్థులు తమ కళా నైపుణ్యాలను ప్రదర్శించారు. ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## ఆయుష్ ఔషధాల ప్రమాణాల నియంత్రణకు చర్యలు

**రాజ్యసభలో విజయసాయి రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబు**

న్యూఢిల్లీ: ఆయుర్వేద ఔషధాలు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఫుడ్ స్టాండర్డ్స్ అండ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధనల మేరకు తయారైనట్లు సర్టిఫై చేసేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నదో తెలపాలని మంగళవారం రాజ్యసభ ప్రశ్నోత్తరాలలో వైఎస్సార్సీపీ సభ్యులు వి.విజయసాయి రెడ్డి ఆయుష్ శాఖ మంత్రిని ప్రశ్నించారు.2025 నాటికి ఆయుష్ ఔషధాల ఎగుమతులను 23 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం ఆయుర్వేద ఔషధాలు ప్రభావశీలంగా, ఇతరత్రా సమస్యలు తలెత్తకుండా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా నియంత్రించి వాటిని సర్టిఫై చేసేందుకు ఎలాంటి పరిశోధనలు, అధ్యయనాలు జరుపుతున్నదో వివరించాలని కూడా ఆయన కోరారు.ఈ ప్రశ్నలకు ఆయుష్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ మహేంద్రబాయ్ జవాబిస్తూ ఆయుష్ ఔషధాలను జీఎంపీ(గుడ్ మాన్యుఫాక్చరింగ్ సర్టిఫికెట్) నిర్దేశించిన ప్రమాణాల మేరకే తయారు చేయాల్సి ఉంటుందని చెప్పారు. అలాగే ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల మేరకు బయో మెడికల్ ప్రాడక్ట్‌గా సర్టిఫికెట్ పొందాల్సి కూడా ఉంటుందని తెలిపారు. ఆయుర్వేద ఉత్పాదనలు ఆయుష్ ప్రీమియం మార్క్ పొందడానికి క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సర్టిఫికెట్ సైతం అవసరం ఉంటుందని చెప్పారు. ఆయుష్ ఔషధాలు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూసేందుకు థర్డ్ పార్టీ సర్వేల ద్వారా వాటి నాణ్యతను పరీక్షించడం జరుగుతుందని చెప్పారు.



# కుల గణనకు మూడు రాష్ట్రాల డిమాండ్ : కేంద్రం

న్యూఢిల్లీ: జనాభా లెక్కల సమయంలో కుల గణన చేపట్టాలని బీహార్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్ర ప్రభుత్వాలు కోరినట్లు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానంద రాయ్ తెలిపారు. ఇవాళ లోక్‌సభలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. స్వాతంత్ర్యం తర్వాత ఎస్సీ, ఎస్టీలను మినహాయిస్తే, ఇతర కులాలకు చెందిన జనాభా లెక్కలు కేంద్ర ప్రభుత్వం చేపట్టలేదని మంత్రి వెల్లడించారు. త్వరలో చేపట్టబోయే జనాభా లెక్కల్లో.. కులాల వివరాలు కూడా సేకరించాలని బీహార్, మహారాష్ట్ర, ఒడిశా ప్రభుత్వా డిమాండ్ చేసినట్లు మంత్రి తెలిపారు. లోక్‌సభలో లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఆయన ఈ విషయాన్ని చెప్పారు.దేశవ్యాప్తంగా జనాభా లెక్కలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 2019, మార్చి 28వ తేదీన జీవోను రిలీజ్ చేసిన




విషయం తెలిసిందే. అయితే కోవిడ్ వల్ల 2021 జనాభా లెక్కల సేకరణ నిలిచిపోయింది. భౌగోళిక, సామాజిక ఆర్థిక అంశాల ఆధారంగా జనాభా లెక్కల్ని సేకరించనున్నారు. విద్య, ఎస్సీ, ఎస్టీ, మతం, భాష, వివాహం, వైకల్యం లాంటి అంశాలను కూడా పరిగణలోకి తీసుకోనున్నారు. తొలి దశ జనాభా లెక్కల కోసం కృశ్చనేర్‌ను నోటిఫై చేసినట్లు మంత్రి తెలిపారు. డిజిటల్ పద్ధతిలో జనాభా లెక్కల సేకరణ ఉంటుందన్నారు. డేటా సేకరణ కోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించినట్లు మంత్రి తెలిపారు.

## ఆ కారణంగా ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని ప్రధాని చెప్పారు: ఎంపీ మిథున్‌రెడ్డి



న్యూఢిల్లీ: లోక్‌సభలో ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని, పోలవరం నిధులను తక్షణమే విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ లోక్‌సభాపక్ష నేత మిథున్ రెడ్డి కోరారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టుకు సకాలంలో కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదు. జాతీయ ప్రాజెక్టులా దాన్ని ముందుకు తీసుకువెళ్లడం లేదు. భూ సేకరణ చట్టం వల్ల అంచనా వ్యయం పెరిగింది. 55,548 కోట్ల రూపాయల సవరించిన అంచనా వేయానికి కేంద్ర జలశక్తి శాఖ ఆమోదం తెలిపింది.కానీ ఇప్పటివరకు కేంద్ర ఆర్థిక శాఖ దీనిపై ఆమోదం తెలపకుండా పెండింగ్‌లో ఉంచింది. ఇరిగేషన్ కాంపోనెంట్, డ్రింకింగ్ కాంపోనెంట్ అనే పేరుతో ప్రాజెక్టు నిధులకు కత్తెర పెడుతున్నారు. దేశంలో ఏ జాతీయ ప్రాజెక్టుకు లేని కొత్త కొత్త షరతులు పెట్టి నిధులను తగ్గిస్తున్నారు. ఈ వ్యత్యాసాన్ని వెంటనే తొలగించాలి. భూసేకరణ చట్టం కింద నష్టపరిహారాన్ని నేరుగా రైతులు ఖాతాల్లో వేయాలి. జాతీయ ప్రాజెక్టును పూర్తిగా కేంద్ర ప్రభుత్వం మిస్ హ్యాండిల్ చేస్తుంది.తెలంగాణ నుంచి రావాల్సిన విద్యుత్ బకాయిలను వెంటనే ఇప్పించాలి. జాతీయ ఆహార భద్రత చట్టం కింద లబ్ధిదారుల సంఖ్యను పెంచాలి. గ్రామీణ ప్రాంతాల్లో 60 శాతం, పట్టణ ప్రాంతాల్లో 40 శాతం మంది ప్రజలకి ఇవ్వడం పక్షపాతం చూపడమే. దీని కారణంగా 56 లక్షల మంది లబ్ధిదారులు నష్టపోతున్నారు. విభజన వల్ల ఏపీ తీవ్రంగా నష్టపోయింది. విభజన వల్ల ఏపీ తలసరి ఆదాయం 8,979కి తగ్గిపోయింది. ఏపీకి 56% జనాభా వస్తే 45% ఆదాయం మాత్రమే దక్కింది. 60% అప్పులు మాపై మోపారు. ఈ నష్టం కారణంగానే మాకు ప్రత్యేక హోదా ఇస్తామని ప్రధానమంత్రి చెప్పారు. మంత్రివర్గంలో దీన్ని పాస్ చేసిన ఇప్పటివరకు ప్రత్యేక హోదా ఇవ్వలేదు. వందలసార్లు ప్రత్యేక హోదా ఇవ్వాలని పార్లమెంటులో అడిగిన కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రత్యేక హోదా ఏపీ ప్రజల హక్కు.ఆంధ్రప్రదేశ్‌లో అదనంగా 12 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేయాలి. 4800 మెగావాట్ల రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టును ఏపీలో ప్రారంభిస్తున్నాం. దీనికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలి. ఒక ఏడాదిలో బొగ్గు దిగుమతి చేసుకునే నిధులతో వీటన్నిటిని పూర్తి చేయవచ్చు. నాడు నేడు కింద 55 వేల పాఠశాలలలో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నారు. రైతుల కోసం రైతు భరోసా కేంద్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాం. వీటిని సందర్శించేందుకు ఆర్థిక మంత్రిని ఆహ్వానిస్తున్నాం.గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడం సరైనది కాదు. కరోనా సమయంలో ఈ పథకం ప్రజలకు ఎంతో ఉపయోగపడింది. మూలధన పెట్టుబడి నిధులను విడుదల చేయకుండా లక్ష్యాలను ఎలా చేరుకుంటారు. ఏపీ రిసోర్స్ గ్యాప్ ఫండింగ్ నిధులను విడుదల చేయాలి. సెస్, సర్ చార్జీల రూపంలో వసూలు చేస్తూ రాష్ట్రాల ఆదాయాలకు కేంద్రం గండి కొడుతుంది. రూ.17,920 కోట్ల రూపాయల అప్పులు అధికంగా టిడిపి, బిజెపి ప్రభుత్వం చేసింది. దీని కారణంగా నెట్ బారోయం సీలింగ్ విధించడం సరైనది కాదు అని ఎంపీ మిథున్‌రెడ్డి లోక్‌సభలో వ్యాఖ్యానించారు.

## వైద్య ఆరోగ్య శాఖ అధికారులను అభినందించిన సీఎం జగన్



అమరావతి: వైద్యఆరోగ్యశాఖ అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. ఇటీవల వారణాసిలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సదస్సులో ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్యశాఖ టెలికన్సల్టేషన్ విభాగం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల విభాగంలో రెండు అవార్డులను గెలుచుకుంది.ఈ అవార్డులను కేంద్రం నుంచి మంత్రి రజని, వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు అందుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సచివాలయంలో సీఎం జగన్‌ను కలిసి రాష్ట్రానికి వచ్చిన అవార్డులను చూపించారు.

## గంజాయి విక్రయాలు చేస్తున్న ముఠా అరెస్టు

**- ఐదుగురు యువకుల అరెస్టు**

**- 11 కేజీల గంజాయి స్వాధీనం**

**- గంజాయి విక్రయాలతో పాటు చోరీలు**

కోనసీమ రావులపాలెంయువతకు చిల్లరగా గంజాయి విక్రయాలు చేస్తూ వారి జీవితాలను నాశనం చేస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను రావులపాలెం పోలీసులు అరెస్టు చేసారు. గంజాయి విక్రయాలతో పాటు పలు చోరీలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. రావులపాలెం పోలీస్ స్టేషన్ లో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొత్తపేట డీఎస్పీ కే.వి.రమణ వివరాలు వెల్లడించారు. రావులపాలెం మండలం దేవరపల్లి శివారు చెల్లిరేవు ప్రాంతంలోని కొబ్బరి తోటల్లో ఒక షెడ్డులో అక్రమంగా గంజాయి నిల్వ చేసి ఉన్నట్లు సోమవారం సిఐ ఎన్. రజనీ కుమార్ కు సమాచారం అందింది. జిల్లా ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ రమణ పర్యవేక్షణలో సిఐ రజనీ కుమార్, ఎస్సై ఎం. వెంకటరమణ సిబ్బందితో కలిసి దాడి చేసారు. ఈ సందర్భంగా గంజాయిని అక్రమంగా నిల్వ చేసిన రావులపాలెం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భాస్కరతేజ, గాంధీ, సాయి, దుర్గాప్రవీణ్, శ్రీహరి, ఒక మైనర్ బాలుడిని అరెస్టు చేసారు. వారి వద్ద నుంచి 11 కేజీల 300 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయాలతో పాటు వీరు రావులపాలెం, ఆలమూరు, పెనుగొండ పోలీసు స్టేషన్ల పరిధిలో చేసిన చోరీలకు సంబంధించిన మూడు మోటారు సైకిళ్లు, 6 బ్యాటరీలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రమణ తెలిపారు. చదువును మధ్యలో ఆపేసిన ఈ యువకులు చెడు వ్యసనాలకు బానిసలై నేరాలకు పాల్పడడంతో పాటు అక్రమంగా గంజాయి రవాణా, విక్రయాలు చేస్తున్నారన్నారు. విశాఖ ఏజెన్సీ నుంచి వీరు గంజాయి తెచ్చి నిల్వ చేసినట్టు విచారణలో తేలిందన్నారు.

## ఏపీలో ఓఎన్‌జీసీ కొత్తగా అన్వేషణ

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో చమురు, సహజ వాయువు నిక్షేపాల కోసం ఆయిల్, నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) మొత్తం 53 చోట్ల కొత్తగా అన్వేషణ సాగించనుంది.ఇందుకోసం రూ.2,150 కోట్లు ఖర్చు చేస్తోంది.పర్యావరణ అనుమతుల కోసం ఓఎన్‌జీసీ చేసిన రెండు వేర్వేరు ప్రతిపాదనలను గత నెలలో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ (ఎస్ఈఐఏఏ) ఆమోదించింది. బావుల నిర్వహణ కారణంగా నష్టపోయిన సందర్భంలో రైతులు, ఆస్తి హక్కుదారులకు పరిహారం చెల్లించాల్సిన బాధ్యత ఓఎన్‌జీసీకి ఉంటుందని అథారిటీ స్పష్టం చేస్తూ షరతు విధించింది.కేజీ బేసిన్‌లో 2028 నాటికి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 50 ప్రాంతాల్లో, అలాగే 2024 కల్లా కడప బేసిన్‌లో కర్నూలు, అనంతపురం, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో మూడుచోట్ల నిక్షేపాల అన్వేషణ కోసం తవ్వకాలను చేపట్టనుంది. వాణిజ్యపరంగా లాభదాయకమని రుజువైతే ఈ బావులను అభివృద్ధి చేసి, సమీపంలోని ప్రారంభ ఉత్పత్తి వ్యవస్థ/గ్యాస్ సేకరణ కేంద్రాలకు అనుసంధానిస్తారు. ఓఎన్‌జీసీ ప్రస్తుతం కేజీ బేసిన్‌లో రోజుకు 4.4 మిలియన్ల ప్రామాణిక క్యూబిక్ అడుగుల గ్యాస్, 700 టన్నులకుపైగా చమురు ఉత్పత్తి చేస్తోంది.



## సంపాదకీయం

బుధవారం 14-12-2022

# అమెరికాలో ఆర్థిక మాంద్యం భయాలు

ఐటీ కంపెనీల షేర్లు మదుపర్లకు పెద్ద షాకిచ్చాయి! ఇన్ఫీ, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ సహా అనేక ఐటీ కంపెనీల షేర్లను మదుపర్లు తెగనమ్ముతున్నారు. వచ్చే ఏడాది ఈ కంపెనీల వాల్యుయేషన్లు మరింత తగ్గుతాయని క్రెడిట్ సూయిస్ సెక్యూరిటీస్ ఇండియా హెచ్చరించడమే ఇందుకు కారణం.అమెరికాలో ఆర్థిక మాంద్యం భయాలు అలుముకుంటున్నాయి. పరిస్థితి నానాటికీ దిగజారుతోంది. ఎకనామిక్ ఔట్‌లుక్ ఏమాత్రం బాగాలేదు. ఫలితంగా భారత ఐటీ కంపెనీల ప్రస్తుత వాల్యుయేషన్లు నిలబడకపోవచ్చని క్రెడిట్ సూయిస్ తెలిపింది. 2023 ఆర్థిక ఏడాది ద్వితీయార్థంలో అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి జారుకుంటుందని అంచనా వేసింది. యూఎస్ ఫెడ్ వడ్డీరేట్లను మరింత పెంచుతుండటం ఇందుకు సంకేతాలు ఇస్తోందని వెల్లడించింది. ద్రవ్యోల్బణం పెరగడంతో మార్చి నుంచి యూఎస్ ఫెడ్ వడ్డీరేట్లను 350 పాయింట్ల మేర పెంచిన సంగతి తెలిసిందే.ప్రస్తుతం భారత ఐటీ కంపెనీలకు 60 శాతం ఆర్డర్లు అమెరికా నుంచే వస్తున్నాయి. ఆదాయంలో ఎక్కువ వాటా అక్కడ్నుంచే వస్తుంది. ఒకవేళ ఆ దేశం మాంద్యంలోకి జారుకుంటే భారత ఐటీ రంగంపై పెద్ద దెబ్బే పడుతుంది. క్లయింట్లు తగ్గిపోయే అవకాశం ఉంది. క్లౌడ్ కంప్యూటింగ్, సంబంధిత సేవలపై ఖర్చులు తగ్గించుకుంటామని అమెజాన్ వెబ్ సర్వీస్ క్లయింట్లు ఈ మధ్యే పేర్కొన్న సంగతి తెలిసిందే. అంతర్జాతీయంగా అనేక వరస సంఘటనలతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే ఇక్కిబిక్కిరి అవుతోంది. ఈ తరుణంలో తైవాన్ రూపంలో మరో సమస్య దూసుకు వస్తోందని ఆర్థిక నిపుణులు అందోళన చెందుతున్నారు. ఇప్పటికే కరోనా, ఇంధన కొరత, సరఫరా వ్యవస్థల్లో సమస్యలు, ఉక్రెయిన్, రష్యా సంక్షోభం వంటి పరిణామాలతో అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలు సమస్యలు ఎదుర్కొంటున్నాయి.తైవాన్ విషయంలో జోక్యం చేసుకోవద్దని చైనా పలు మార్లు అమెరికాను కోరింది. తైవాన్ నాయకత్వాన్ని రెచ్చగొడుతున్న అమెరికా చైనాతో కయ్యానికి కాలుదువ్వుతోంది.ఈ తరుణంలో చైనా తైవాన్‌పై చర్యకు దిగితే సమస్య అంత్యంత జఠిలంగా మారుతుందని, ఇది 2008 నాటి ప్రపంచ ఆర్థిక మాంధ్యం పరిస్థితులను మళ్లిట తీసుకు వచ్చేలా ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇది ఉక్రెయిన్, రష్యా సమస్య కంటే పది రెట్లు ప్రభావం చూపిస్తుందని అంచనా వేస్తున్నారు.రష్యా, ఉక్రెయిన్ తరహాలోనే చైనా–తైవాన్ వివాదం కేవలం ఆ రెండు దేశాలకే పరిమితి కాదు. తైవాన్‌పై చైనా చర్యకు దిగితే వెంటనే అమెరికా నేరుగా జోక్యం చేసుకునే అవకాశం ఉంది. అప్పుడు రెండు అగ్రదేశాల మధ్య వివాదంగా అది మారుతుంది. అమెరికాకు జపాన్ కూడా మద్దతు పలికితే అది మరింత తీవ్రరూపం తీసుకుంటుంది. చైనా క్షిపణి దాడులు చేస్తే సముద్ర మార్గం, గగనతలం కూడా ప్రమాదకరంగా మారాతాయి. దీని వల్ల జల రవాణాపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఫలితంగా సరఫరా వ్యవస్థల్లో మళ్లిట తీవ్రమైన అంతరాయాలు కలుగుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.'స్వల్ప హెచ్చరికలు మొదలయ్యాయి. 2023లోకి వెళ్లేకొద్దీ మరింత పెద్దవి అవుతాయి. టెక్నాలజీ, ఎగుమతి ఆధారిత కంపెనీల షేర్లను కొనుగోలు చేయొద్దు. ఆరు నెలల తర్వాత చాలా తక్కువ ధరకు దొరుకుతాయి' అని ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్ ఈక్విటీ మాజీ హెడ్ సందీప్ సభర్వాల్ ఇంతకు ముందే ట్వీట్ చేయడం గమనార్హం. మరో వైపు దేశంలో ఆర్థిక కార్యకలాపాలు పుంజుకున్నాయి. పన్ను వసూళ్లపై సానుకూల ప్రభావం చూపింది.పంచ ఆర్థిక వ్యవస్థలో చైనాలో తయారీ వస్తువుల పాత్ర గణనీయంగా ఉంది. చైనా పై ఆంక్షలు విధిస్తే దాని ప్రభావం చాలా దేశాలపై తీవ్రంగా ఉంటుంది. చివరకు అమెరికా, దాని మిత్ర దేశాలపై కూడా ఈ ప్రభావం ఉంటుంది. చైనాకు చిక్కులు తప్పవు. మన దేశంతో పాటు, అనేక ఐరోపా దేశాలు కూడా చైనాపై ఎంతగా ఆధారపడ్డాయో కరోనా సమయంలో వెల్లడైంది. అమెరికా మిత్రపక్షమైన జపాన్‌ను కూడా చైనా టార్గెట్ చేసుకుంటే మాత్రం ప్రపంచ ఆర్థిక మాంధ్యం అనివార్యంకానుంది.చైనా, తైవాన్ వివాదం ముదిరి యుద్ధానికి దారిస్తే అందరికీ నష్టమే. చైనా ఆర్థిక వ్యవస్థతో పాటు, అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలు సమస్యలు ఎదుర్కొంటాయి. చైనా జీడీపీలో ఎగుమతుల వాటా గణనీయంగా ఉంది. చైనా ప్రధానంగా చమురు, ఆహార పదార్థాలను దిగుమతి చేసుకుంటోంది. యుద్ధం, ఆంక్షలు వస్తే చైనాకు దిగుమతులు నిలిచిపోతాయి. అలాగే చైనా నుంచి భారీ స్థాయిలో జరిగే ఎగుమతులు నిలిచిపోయో ప్రమాదం ఉంది. చైనా నుంచి విద్యుత్ కార్లను అమెరికా భారీ ఎత్తున దిగుమతి చేసుకుంటోంది. అమెరికా ఆంక్షలు పెడితే చైనాతో పాటు, అమెరికాకు అంతే స్థాయిలో నష్టం జరుగుతుంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంధ్యం ముంగిట ఉంది.

# సిక్కోలు రైతులకు కన్నీళ్లు

శ్రీకాకుళం, డిసెంబర్ 13, బంగాళాఖాతంలో ఏర్పడిన మాండౌస్ తుపాను సిక్కోలు రైతులకు కన్నీళ్లు మిగిల్చింది. చేతికి అందిన పంటను కాపాడుకునేందుకు అన్నదాతలు నానాపాట్లు పడుతున్నారు. ఇవాళ కూడా వర్షాలు కురుస్తాయన్న అధికారుల సమాచారంతో మరింత ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులను పరుగులు పెట్టిస్తున్నాయి. పొలాల్లో కోసిన వరిని, కల్లాల్లో నూర్చేందుకు రెడీ చేసిన పంటను కాపాడుకోవడానికి శ్రమిస్తున్నారు. పండిన పంటను కోతలు కోసి కుప్పలుగా పేరుస్తున్నారు. కుప్పలపై టార్పా లిన్లు కప్పి సంరక్షించుకుంటున్నారు. కల్లాల్లో ఇప్పటికే కోసి ఆర బోసిన ధాన్యం రాశులను బస్తాల్లో ఎత్తి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున వ్యవసాయాధికారులు మాత్రం వరి పంటను రెండు రోజులు పాటు కోయవద్దని సూచిస్తు న్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు సక్రమంగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో మాండౌస్ తుపాను మరింత కుంగదీస్తోంది. చాలామంది రైతులు ధాన్యం సిద్ధం చేసి అమ్మేందుకు సన్నద్ధమైనా నిబంధనల పేరిట అధికార యంత్రాంగం కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిస్థితులను పరిశీలించేందుకు రంగంలోకి దిగారు. శుక్రవారం కలెక్టర్ ఏకంగా నలుగురు సిబ్బందిని సస్పెండ్ చేయగా జాయింట్ కలెక్టర్ కూడా జిల్లాలో పలుప్రాంతాల్లో పర్యటించి – మిల్లులు, ఆర్బీకేల వద్ద ధాన్యం కొనుగోలుపై ఆరా తీశారు. ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజ ఆన్లైన్ పద్ధతి లో కొనుగోలు చేసి నగదు కూడా అదే పద్ధతిన వారి ఖాతాల్లో వేయాలని పక్కా ప్రణాళికలను సిద్ధం చేసింది. దీనిపై గత కొద్ది రోజులుగా జిల్లా యంత్రాంగం సచివాలయ సిబ్బందికి తర్ఫీదు ఇచ్చినప్పటికీ సాంకేతిక లోపాల నుంచి బయట పడలేదు. ఈ పరిస్థితుల్లో వచ్చిన తుపాను రైతులను నిలువునా ముంచేసింది. రెండు రోజులుగా జిల్లా అంతట చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. ఆరుగాలం పండించిన పంట వర్షాలతో నష్టపోతామన్న భయంతో రైతులు వణికిపోతున్నారు. వర్షానికి తోడు చలిగాలులు వీస్తుండ డంతో పంటను సురక్షిత ప్రాంతాలకు తరలిం చేందుకు నానాపాట్లు పడుతున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా ధాన్యాన్ని తడవకుండా రైతులు కాపాడుకోలేకపోయారు. తడిచిన ధాన్యాన్ని అధికారులు కొంటారా కొనరా అన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది.అధికారులు మాత్రం ఆందోళన చెందవద్దని రైతులకు భరోసా ఇస్తున్నారు.

రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి, కనీస మద్దతు ధర కల్పిస్తామంటున్నారు. జిల్లాలో 613 ఆర్బీకేలు ఉండగా ఇప్పటివరకు 175 కేంద్రాల నుంచి 7,091.800 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. కొనుగోలుకు కావలసిన సిబ్బంది, గోనె సంచులు, ధాన్యం నాణ్యత ప్రమాణాలను కొలిచే పరికరాలు అన్ని రెడీగా ఉన్నాయన్నారు. రైతులు కనీస మద్దతుధర పొందడానికి ధాన్యాన్ని బాగా ఆరబెట్టుకొని శుభ్రం చేసి దగ్గరలో ఉన్న కొనుగోలు కేంద్రంలో తెలియజేయాలన్నారు. తమ ధాన్యానికి ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధర కంటే ఎక్కువ ధర బహిరంగ మార్కెట్‌లో వస్తే అమ్ముకోవచ్చని అధికార యంత్రాంగం ప్రకటించింది. ధాన్యం కొనుగోలులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన జిల్లా కంట్రోల్ రూమ్ నెంబర్లు 95058 23016, 91777 44402, 77805 61968, 99634 79141కు తెలియజేయాలన్నారు.

# కోలుకుంటున్న పట్టుపరిశ్రమ

విజయవాడ, డిసెంబర్ 13, ఏపీలో పట్టు పరిశ్రమ కోలుకుంటుంది. కరోనా పరిస్థితుల కారణంగా దయనీయంగా మారిన పరిశ్రమకు ఇప్పుడు క్రమేణా మంచి రోజులు వస్తున్నాయి. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది అధిక దిగుబడితో రాబడి పెరిగిందని రైతులు అంటున్నారు. ఈ మార్కెట్ విధానంలో పట్టు గూళ్ళ విక్రయాలు జరగటంతో దళారుల ప్రమేయం లేదని చెబుతున్నారు.పట్టు మార్కెట్ కు పూర్వ కళ వచ్చింది. డిమాండ్ తో పాటుగా పెరిగిన ఉత్పత్తితో మార్కెట్ కళకళ లాడుతోంది. ఈ మార్కెట్ విధానం అమలుతో దళారులకు చెక్ పడింది. రైతులకు ఆదాయం, ప్రభుత్వ ఖజానాకు కాసులు వచ్చిపడుతున్నాయి. పట్టు పరిశ్రమ పూర్తిగా ప్రకృతి పైనే ఆధారపడి ఉంటుంది. రైతులు ప్రకృతిలోని వనరులను వినియోగించుకుని, వాటిని గూళ్ళుగా పరిరక్షించి సహజసిద్ధంగా పట్టు గూళ్ళను రెడీ చేస్తుంటారు. అయితే గత రెండు సంవత్సరాలుగా పట్టు పరిశ్రమకు పూర్తిగా గడ్డు కాలమనే చెప్పాలి. దీనిక తోడు మధ్యవర్తుల ప్రమేయంతో మార్కెట్ పూర్తిగా నాశనం అయ్యిందని రైతులు తీవ్ర ఆవేదనలో ఉండే పరిస్థితులు నుంచి నేడు మరోసారి పట్టు పరిశ్రమకు పూర్వ వైభవం వస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పట్టుగూళ్ల విక్రయ కేంద్రం మరోసారి పట్టు రైతులతో కళకళ లాడుతుంది. తెలుపు రంగులో పట్టు గూళ్ళు మార్కెట్ లకు తరలి వస్తుంది. ఇక్కడ ఈ మార్కెట్ ద్వారా డిమాండ్ కు అనుగుణంగా సరుకును దక్కించుకున్న వ్యాపారులు స్టాక్ ను ప్రోసెసింగ్ సెంటర్ కు తరలించి, అక్కడ నాణత్య మేరకు ముడి సరుకును తయారు చేసుకుంటారు. అలా తయారైన ముడి సరుకును మగ్గం కేంద్రాలకు తరలిస్తారు. అక్కడ వివిధ రకాల దుస్తులు, ఉత్పత్తులు తయారు చేస్తుంటారుఉమ్మడి కృష్ణాజిల్లా లోని హనుమాన్ జంక్షన్ లో పట్టుగూళ్ల విక్రయ కేంద్రం ఉంది. కోస్తా జిల్లాలో ఎక్కడ పట్టు పరిశ్రమలు ఉన్నా, వాటి సరుకు మాత్రం ఇక్కడకు రావాల్సిందే. పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో నడుపుతున్న మార్కెట్ కావటంతో గిట్టుబాటు ధర లభిస్తుందనే ఆశతో రైతులు ఇక్కడకు రావటానికి మక్కువ చూపుతుంటారు. కానీ చాలా మంది దళారులు రైతులను నమ్మించి మోసం చేస్తున్న ఘటనలు వెలుగు లోకి వచ్చాయి. దీంతో ప్రభుత్వం పక్కాగా ఈ మార్కెట్ ను అమలులోకి తీసుకువచ్చింది. దీని వల్ల రైతులు ఎక్కడ ఉన్నా తమ పంటను విక్రయించుకునేందుకు అవకాశం కలిగింది. అదే విధంగా కొనుగోలు దారులు ఈ మార్కెట్ లోనే క్రయవిక్రయాలు జరుపుతున్నారు. రైతులకు గిట్టుబాటు ధర లభించటంతో పాటుగా ప్రభుత్వ ఖజానాకు ఆదాయం లభిస్తోంది. గత ఏడాది నవంబర్ నాటికి 88టన్నుల పట్టు లావాదేవీలు జరిగాయి. దీంతో మార్కెట్ యార్డ్ కు 5 లక్షల ఆదాయం లభించింది. ఈ ఏడాది నవంబర్ నాటికి అత్యధికంగా 172 టన్నుల స్టాక్ వచ్చింది. మార్కెట్ ఫీజ్ కింద 13 లక్షల రూపాయలు ఆదాయం లభించిందని మార్కెట్ అధికారి దుర్గారావు వెల్లడించారు. ఏడు జిల్లాల నుంచి రైతులు తమ పంటను ఇక్కడి మార్కెట్ కు తీసుకురావడంతో రైతులకు ఆశించిన ధర లభిస్తుందని ఆయన తెలిపారు. గత ఏడాదితో పోల్చితే డిమాండ్ పెరగటంతో, మార్కెట్ ఊపందుకుందని వెల్లడించారు.

# హమ్మయ్య.. వారాహి అనుమతి వచ్చేసింది

ఏలూరు, డిసెంబర్ 12, పవన్ కళ్యాణ్ వాహనం వారాహి రంగుపై వైఎస్ఆర్‌సీపీ నేతలు చేస్తున్న విమర్శలు తేలిపోయాయి. వారాహి రిజిస్ట్రేషన్ కు తెలంగాణ రవాణా శాఖ అనుమతి ఇచ్చింది. వారాహికి ఉన్న రంగు.. ఆలీవ్ గ్రీన్ కాదని తేల్చారు. వాహనాలకు ఆలివ్ గ్రీన్ వాడొద్దని రూల్ ఉన్న మాట నిజమే కానీ.. వారాహి రంగు ఎమరాల్డ్ గ్రీన్ అని అధికారులు నిర్ధారించారు. వెహికల్ బాడీ బిల్డర్ ఇచ్చిన సర్టిఫికెట్‌ను పరిశీలించి.. ఆర్టీఏ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆలివ్ గ్రీన్ ఎమరాల్డ్ గ్రీన్ మధ్య సిమిలారిటీ ఉందని.. అయితే రెండూ ఒకటి కాదని రవాణాశాఖ అధికారులు స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ కోసం వాహనం తమ వద్దకు వచ్చినప్పుడు అన్ని నిబంధనలు పక్కాగా పరిశీలించామని.. నిబంధనల ప్రకారం వాహనం రంగు ఉండటంతో రిజిస్ట్రేషన్ పూర్తి చేసేందుకు అంగీకరించారు. వారం రోజులు క్రితమే టీఎస్13ఇఎక్స్8384 నెంబరుతో రిజిస్ట్రేషన్ పూర్తి అయిందని..ట్రాన్స్‌పోర్ట్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ తెలంగాణ పాపారావు మీడియాకు తెలిపారు. కేంద్ర మోటారు వాహనాల చట్టం ప్రకారం.. చాప్టర్ 121లో ఒక విషయం స్పష్టంగా ఉంది. డిఫెన్స్ శాఖకు చెందిన వాహనాలకు తప్ప అగ్రికల్చర్ ట్రాక్టర్లతో పాటు ఇతర ఏ వాహనాలకూ ఆలివ్ గ్రీన్ కలర్ పెయింటింగ్‌గా వేయకూడదని ఆ నిబంధనల్లో స్పష్టంగా ఉంది. ప్రస్తుతం పవన్ ప్రచార రథమైన 'వారాహి'కి ఎమరాల్డ్ గ్రీన్ పెయింటింగ్ వేయడంతో ఈ వివాదానికి దాదాపు ఫుల్‌స్టాప్ పడినట్టే. వారాహి? రెడీ ఫర్ ఎలక్షన్ బ్యాటిల్. అంటూ పవన్ కల్యాణ్ తన ఎన్నికల ప్రచార రథాన్ని సిద్ధం చేసుకున్నారు. వచ్చే ఎన్నికల కోసం ఈ ప్రచార వాహనాన్ని తయారు చేశారు. ప్రత్యేక వసతులు అందులో కల్పించారు. కొండగట్టు– ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద పూజలు చేసి వాహనం వినియోగించాలని నిర్ణయించారు. 1982లో తెలుగుదేశం పార్టీ ని స్థాపించిన తర్వాత ఎన్టీఆర్ ఎన్నికల ప్రచారానికి సంబంధించి అప్పట్లో గ్రీన్ కలర్ వాహనాన్నే ప్రచార రథంగా ఉపయోగించారు. పవన్ కళ్యాణ్ కూడా అదే తరహాలో గ్రీన్ రంగుతో ప్రత్యేక వాహనాన్ని రూపొందించారు. అయితే వాహనంపై ఉన్న ఆలీవ్ గ్రీన్ అని.. నిబంధనల ప్రకారం రక్షణ రంగ వాహనాలకు తప్ప ఇతర ప్రైవేట్ వాహనాలకు ఈ రంగు వాడటంపై నిషేధం ఉందని వైసీపీ నేతలు వివాదాన్ని తెరపైకి తెచ్చారు. అయితే దీనికి జనసేన నేతలు గట్టిగానే కౌంటర్ ఇచ్చారు. తమకు కోర్టులతో చీవాట్లు తినే అలవాటు లేదని.. నిబంధనలు తమకు తెలియవా అని ప్రశ్నించారు. అన్నట్లుగానే ఏ ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. దీంతో వైఎస్ఆర్‌సీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమైనవని తేలిపోయినట్లయింది. ఈ అంశంపై వైఎస్ఆర్‌సీపీ నేతలు స్పందించాల్సి ఉంది. ఏపీలో రూల్ ఫాలో అవ్వాల్సిందేనాతెలంగాణలో రిజిస్ట్రేషన్ చేసినా ఏపీలో రూల్స్‌ను కూడా ఫాలో కావాల్సి ఉంటుందంటూ కీలక వ్యాఖ్యలు చేశారు మంత్రి గుడివాడ అమర్‌నాథ్. పవన్ వాహనం నెంబర్లు కూడా చంద్రబాబుకు నచ్చినట్లే పెట్టుకున్నారని విమర్శించారు. మరోవైపు పవన్ ప్రతిదీ సినిమాలా ఆలోచించడం వల్లే ఇలాంటివన్నీ జరుగుతున్నాయన్నారు సజ్జల. తెలంగాణలో రిజిస్ట్రేషన్ అయిపోయిన వారాహి వెహికల్ ఏపీలో అడుగు పెడితే ఎలాంటి రియాక్షన్స్ వస్తాయో మరి.

# డైట్ కాలేజీ వార్షికోత్సవానికి హాజరయిన మిజోరం గవర్నర్

అనకాపల్లి అవకాశాలు అందిపుచ్చుకుంటే విద్యా ర్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని మిజోరం రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు.అనకాపల్లి జిల్లా దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ డైట్ కళాశాలలో 'వైబ్రంట్ డైట్'2022' పేరుతో కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా గవర్నర్ హరిబాబు కు మాజీ మంత్రి, డైట్ కళాశాల ఫౌం డర్ చైర్మన్ దాడి వీరభద్రరావు, డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మేళ తాళాలతో సంప్రదాయబద్దంగా ఘన స్వాగతం పలికారు.అనంతరం కళా శాలలో రెండు రోజులపాటు నిర్వహిం చే వార్షికోత్సవ వేడుకలను గవర్నర్ హరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమా వేశంలో హరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో గల ఇంజినీరింగ్ కళాశాల లో డైట్ కళాశాల 4వ ర్యాంకు సాధించ డం అభినంద నీయమన్నారు. అలాగే డైట్లో చదివే క్వాలిటీ విద్యనందించి విద్యార్థులకు మంచి ప్లేస్మెంట్స్ కల్పించడం సంతోషకరమన్నారు.

గతంలో చదువుకొనే రోజుల్లో సాంకేతిక పరిజ్ఞానం ఉండేదికాదని, అప్పట్లో ల్యాండ్ ఫోన్ కనెక్షన్ కావాల న్నా దరఖాస్తు చేసుకున్న ఐదేళ్ల తరు వాత వచ్చేదని, నేడు 5 నిముషాల్లో సిమ్ కార్డు పొందే అవకాశం ఉందని, దీంతో మొబైల్ ద్వారానే ఎన్నో తెలు సుకొని పరిజ్ఞానం నేడు ఏర్పడిరదన్నా రు. నేటి ఆధునిక, సాంకేతిక పరిజ్ఞా నంను వినియోగించుకొని మంచి ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. అలాగే భారతదేశాన్ని ప్రపంచంలో మంచి అభివృద్ధి సాధించిన దేశంగా మార్చేందుకు ప్రధాని నరేంద్రమోదీ ఎంతో కృషి చేస్తున్నారని, దీనిలో భాగంగా మేకి ఇన్ ఇండియా కార్యక్రమం ద్వారా మనకు కావాల్సిన అవసరాలన్నీ మనమే స్వయంగా తయారు చేసుకొనేలా సంస్క రణలు ప్రధాని రూపొందిస్తున్నారన్నారు. దీనిలో భాగంగా గతంలో 2 మొబైల్ కంపెనీలు మాత్రమే భారత్లో ఉంటే నేడు సుమారు 200 మొబైల్స్ తయారీ కంపెనీలు ఉన్నాయన్నారు. దీంతో ఇతర దేశాలకు కూడా భారత్ నుంచి ఎగుమతులు చేయడం జరుగుతుం దన్నారు.

## వేదాద్రి ప్రాజెక్ట్ కోసం రైతుల ఎదురు చూపులు

విజయవాడ, డిసెంబర్ 13, వేదాద్రి ఎత్తిపోతల ప్రాజెక్టు శంకుస్థాపన చేసి రెండేళ్లు దాటినా పూర్తికాని పనుల వలన స్దానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయానికి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామన్న ప్రభుత్వం దీనిపై ఇంత వరకు క్లారిటీ ఇవ్వలేదని అధికారులు అంటున్నారు.నాటి కృష్ణా జిల్లా నేటి ఎన్టీఆర్ జిల్లాలోని వేదాద్రి ఎత్తిపోతల పథకం పనులు నేటికి పూర్తి కాలేదు. ఆరు నెలల్లో పూర్తి చేస్తామని స్వయంగా సీఎం హామీ ఇచ్చిన ఈ ప్రాజెక్టు.. శంకుస్థాపన చేసి రెండేళ్లు దాటినా.. నేటికీ పనులు కొలిక్కి రాలేదని స్దానికులు అంటున్నారు. 2021 ఫిబ్రవరి కల్లా వేదాద్రి ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తి చేస్తానని సీఎం జగన్? చెప్పారు. అయితే ఈ ప్రాజెక్ట్ కు నేటికి అతీగతీ లేకుండాపోయింది. జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాలను సస్యశ్యామలం చేసే ఉద్దేశంతో గత తెలుగుదేశం ప్రభుత్వం 489 కోట్ల రూపాయల వ్యయంతో ముక్త్యాల ఎత్తిపోతల పథకాన్ని నిర్మించ తలపెట్టింది. 386 క్యూసెక్కుల నీటిని 120 రోజులపాటు ఎత్తిపోతల ద్వారా సాగు భూములకి అందించాలన్నది ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా పులిచింతల ప్రాజెక్టు దిగువన ముక్త్యాల గ్రామం వద్ద పంప్‌హౌస్ నిర్మించాలని నిర్ణయించారు. ఈ ఎత్తిపోతల ద్వారా జగ్గయ్యపేట మండలంతో పాటు చుట్టుపక్కల ఉన్న 38వేల 627 ఎకరాలను సాగులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక అత్యంత ప్రతష్టాత్మకంగా తలపెట్టిన రివర్స్? టెండరింగ్? పేరుతో ప్రాజెక్టుకు మళ్లీ నామకరణం చేశారు. 2019లో ప్రభుత్వం మారాక ప్రాజెక్ట్ పేరును కూడా మార్చారు. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం.. రివర్స్ టెండరింగ్ పేరుతో పేరు, స్థలం మార్చి అంతే అంచనా వ్యయంతో వైఎస్ఆర్ వేదాద్రి ఎత్తిపోతల పథకంగా నామకరణం చేసింది. 2020 ఆగస్టులో ముఖ్యమంత్రి జగన్ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించి రెండేళ్లు దాటినా నేటికీ పూర్తికాలేదు. పెండింగ్ బిల్లులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్ట్ సంస్థ పనులు మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయిందని స్దానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ సాగు భూములకు నీరందిస్తే పంటలు బాగా పండుతాయని ఆశించిన వేదాద్రి ఆయకట్టు రైతులకు నేటికీ నిరాశే మిగిలింది. రైతులను వేదాద్రి ఎత్తిపోతల పథకం వెక్కిరిస్తుందంటూ సోషల్ మీడియాలో పొలిటికల్ వార్ నడుస్తుంది. సుమారు 40 వేల ఎకరాలకు సాగునీటి సమస్య తీర్చాలన్న లక్ష్యంతో ప్రారంభమైన వేదాద్రి ఎత్తిపోతల పథకం నేడు రైతులకు కీలకంగా మారింది. రివర్స్ టెండరింగ్ పేరుతో ప్రభుత్వం సమయం వృథా అయ్యిందని, 30 శాతం పనులు పూర్తి చేసిన గుత్తేదారు సంస్థలు పెండింగ్ నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు నిలిపేశాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్కడున్న ఇసుక, ఇనుము, రాళ్లు వంటి నిర్మాణ సామాగ్రి అంతా వేరే పనుల వద్దకు కాంట్రాక్టర్ తరలించారని రైతులు చెబుతున్నారు. అంతే కాదు కాంట్రాక్ట్ సంస్థకు చెందిన సిబ్బంది కూడా వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారు. ప్రస్తుతం వేదాద్రి ఎత్తిపోతల పథకం నిర్మాణం జరిగే దగ్గర కేవలం భద్రతా సిబ్బంది ఒక్కరే ఉన్నారు. వేదాద్రి ఎత్తిపోతలపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులు.. ఇప్పుడు ఉసూరుమంటున్నారని స్థానిక రాజకీయ నేతలు విమర్శిస్తున్నారు. కాల్వలకు దూరంలో ఉన్న తమ పొలాలకు నీరు అందడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

# తిరుపతా...కాకినాడ...

కాకినాడ, డిసెంబర్ 12, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఈసారి ఎక్కడి నుంచి పోటీ చేయనున్నారు? ఆయన ఈసారైనా అసెంబ్లీలోకి అడుగు పెడతారా? పవన్ గెలిచేందుకు అనువైన నియోజకవర్గాలు ఏవి? పవన్ కు కేవలం కాపు సామాజికవర్గం నుంచే కాకుండా అభిమానుల ఓట్లు ఎక్కువగా ఎక్కడ ఉన్నాయి? ఈ దిశగా ఒక సర్వే సంస్థ ప్రత్యేకంగా సర్వే చేస్తున్నట్లు సమాచారం. ఈసారి ఒకచోట నుంచే పోటీ చేయాలని పవన్ కల్యాణ్ డిసైడ్ అయ్యారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో మాదిరి రెండు చోట్ల కాకుండా ఈసారి ఒకేచోట నుంచి పోటీ చేసి అక్కడి నుంచే అసెంబ్లీకి వెళ్లాలన్నది జనసేనాని యోచన. అందుకు అనుగుణంగా నాలుగైదు నియోజకవర్గాల్లో ఈ సంస్థ ప్రత్యేకంగా సర్వే చేస్తున్నట్లు సమాచారం. అక్కడ పార్టీ ప్రభావంతో పాటు పవన్ కు ఉన్న అభిమానుల సంఖ్య, ప్రత్యర్థుల బలాలు, బలహీనతలు వంటివి ఈ సర్వేసంస్థ అంచనా వేస్తుంది. ఎక్కువ సంఖ్యలో జనాభిప్రాయాన్ని సేకరిస్తున్నారు. పవన్ పోటీ చేస్తే ప్లస్ ఏంటి? మైనస్ లు ఏంటి? ప్రత్యర్థి పార్టీల నుంచి ఎవరు అభ్యర్థులు ఉంటారన్న అంచనా వేసి మరీ ఈ సర్వేను నిర్వహిస్తున్నారని తెలిసింది. అక్కడ ప్రధానంగా వైసీపీ, తెలుగుదేశం బలాబలాలను కూడా పరిగణనలోకి తీసుకుని సర్వేను చేస్తున్నారని విశ్వసనీయంగా తెలిసింది. గత ఎన్నికల్లో పవన్ కల్యాణ్ ఎలాంటి ముందస్తు కసరత్తు లేకుండానే పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, విశాఖపట్నంలోని గాజువాక నుంచి పోటీ చేశారు. అయితే రెండు చోట్ల ఆయన ఓటమి పాలయ్యారు. పార్టీ అధినేతగా పవన్ కు ఈ ఓటమి తలవంపులు తెచ్చిపెట్టింది. పార్టీ పెట్టిన పదేళ్లకు కూడా ఆయన అసెంబ్లీలోకి అడుగుపెట్టలేకపోయారన్న విమర్శలను ఎదుర్కొన్నారు. ఎమ్మెల్యేగా గెలిచి ముందు తర్వాత తమను విమర్శించాలని ప్రత్యర్థి పార్టీలు సవాళ్లు కూడా విసురుతున్నాయి. అందుకే ఈసారి పవన్ ఆచితూచి అడుగులు వేస్తున్నారని చెబుతున్నారు.పవన్ కల్యాణ్ ఈసారి తిరుపతి నియోజకవర్గం కాని, కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి కాని పోటీ చేసే అవకాశాలు ఎక్కువగ కనిపిస్తున్నాయి. పిఠాపురం నియోజకవర్గం కూడా పరిశీలనలో ఉంది. ఈ మూడు నియోజకవర్గాల్లోనూ సర్వే నిర్వహిస్తున్నారు. రెండు నియోజకవర్గాల్లో టీడీపీ కొంత బలహీనంగా ఉండటం, అక్కడ కాపు సామాజికవర్గం బలంగా ఉండటం, అభిమానుల సంఖ్య కూడా అపరిమితంగా ఉండటంతో అక్కడి నుంచే పోటీ చేయాలని భావిస్తున్నారు. అయితే తాను అన్ని నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించాల్సి రావడంతో ఎక్కడ సులువుగా విజయం సాధించవచ్చన్న దానిపైనే ఎక్కువగా సర్వే సంస్థ ఫోకస్ పెట్టినట్లు తెలిసింది. ఇటు సీమ నుంచి కానీ లేదా తన పార్టీకి పట్టున్న తూర్పు గోదావరి జిల్లా నుంచే ఈసారి పవన్ కల్యాణ్ పోటీకి దిగే అవకశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# పెండ్లి మర్రి లో రాష్ట్రానికి ఇదేం కర్మ

పెండ్లి మర్రి డిసెంబర్ 13 ఇదేం కర్మ ఈ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ఈరోజు పెండ్లిమర్రి మండలం కొత్త గంగిరెడ్డి పల్లె గ్రామపంచాయతీ కొత్తూరు రెడ్డి కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈరోజు ఇదేం కర్మ ఈ రాష్ట్రానికి కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి జగన్ చేస్తున్నటువంటి అసత్య ఆరోపణలు టీచర్ల జీతాలు ఇవ్వనందున ప్రజలు గమనించాలని రైతులకు సూక్ష్మ పరికరాలు ఎన్నెన్నో ఇబ్బందులు గురిచేస్తున్నటువంటి సమస్యల గురించి ప్రజలు వివరించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల పార్టీ అధ్యక్షుడు సంఘటి గంగిరెడ్డి బూతు కమిటీ మెంబర్లు , సర్పంచ్ ప్రతాప్ రెడ్డి , శ్రీనివాసులు రెడ్డి ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# కడప గడపలో టీడీపీ ప్లాన్..

కడప, డిసెంబర్ 12, ఆవిర్భావం తర్వాత కడప అసెంబ్లీ నియోజకవర్గంలో మూడుసార్లు గెలిచింది టీడీపీ. 1999 ఎన్నికలే ఇక్కడ టీడీపీకి ఆఖరు గెలుపు. ఆ తర్వాత రెండు సార్లు కాంగ్రెస్.. రెండుసార్లు వైసీపీ? ఇక్కడ విజయం సాధించాయి. అయితే ఈసారి ఎలాగైనా కడపసీటును గెలిచితీరాలన్న కసితో కనిపిస్తోంది సైకిల్ పార్టీ. వర్గపోరు కారణంగా క్యాడర్‌లో చీలికలు రావడంతో పార్టీ కొంత చతికిలబడినా? ఈసారి ముందస్తు ప్రణాళికలతో దూసుకెళ్లాలని భావిస్తోంది. ఇన్నాళ్లూ ప్రధాన పార్టీలన్నీ? కడప అసెంబ్లీ అనగానే.. అయితే రెడ్డి, లేదంటే మైనార్టీ.. అన్నట్టుగా సీట్లు కేటాయించాయి. గత రెండు ఎన్నికల్లో వైసీపీ అయినా, అంతకు ముందు కాంగ్రెస్ అయినా.. మైనార్టీలకు సీటు కేటాయించి విజయం సాధించాయి. ఈ సారి కూడా ఆ పార్టీలు.. అదే సంప్రదాయాన్ని కొనసాగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, ఈసారి గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్న టీడీపీ.. కొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. కడపలో పోటీకి.. టీడీపీ హైకమాండ్ ఈసారి వినూత్న ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. కడపగడపలో మహిళకు సీటు కేటాయించి? ప్రధాన పార్టీలకు గట్టీ పోటీ ఇవ్వాలని భావిస్తోంది. వైసిపి వ్యతిరేక ఓటుని చీల్చి.. కడప సీటును తన ఖాతాలో వేసుకోవాలని గట్టి ప్రణాళికతో ముందుకు రాబోతోందట. ఇది, జనరల్ సీటు కావడంతో? ఇప్పటి వరకూ పురుషులకే అవకాశం దక్కింది. దీంతో, ఈసారి కాస్త డిఫరెంటు వేలో వెళ్లాలనుకుంటున్న టిడిపి .. లేడీస్‌ను రంగంలోకి దింపి సత్తా చాటాలనుకుంటోంది. దానికోసం బలమైన అభ్యర్థిని వెతికే పనిలో నిమగ్నమైందట హైకమాండ్. దీనికోసం భారీ కసరత్తులే చేస్తోందిట. పార్టీలో ప్రధాన భూమిక పోషిస్తున్న రెండు కుటుంబాల నుంచే ఆ మహిళా అభ్యర్థి ఎంపిక ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. టిడిపి పోలిట్ బ్యూరో మెంబర్ శ్రీనివాస రెడ్డి , కడప టిడిపి నేత అలంఖాన్ పల్లె లక్ష్మిరెడ్డి కుటుంబాల నుంచి.. ఎవరో ఒకరిని బరిలో దింపే ఆలోచనలో టీడీపీ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, మహిళా అభ్యర్థికి అనుకున్నస్థాయిలో ఓట్లు వస్తాయా? రావా? అనే విషయంలో సర్వేలు కూడా చేయించినట్టు సమాచారం. కడప మున్సిపాలిటీలో ప్రస్తుతం టీడీపీకి ఒకేఒక్క కార్పొరేటర్ ఉన్నారు. ఆవిడే అలంఖాన్ పల్లె లక్ష్మిరెడ్డి కోడలు ఉమాదేవి. అంతా ఓడినా ఆమె మాత్రం టీడీపీ జెండా ఎగరేశారు. కాబట్టి? ఈసారి కడప అసెంబ్లీ బరిలో టీడీపీ తరపున మహిళకు సీటు కేటాయిస్తే.. అది ఆమెకే ఇస్తారన్న ప్రచారం జోరందుకుంది. మరొకరికి అవకాశం ఇవ్వాల్సి వస్తే? అధికారం ఉన్నా, లేకున్నా పార్టీ కోసం నిలబడిన శ్రీనివాస రెడ్డి కుటుంబానికే దక్కుతుంది. ఆ లెక్కన ఆయన భార్య.. రేసులో ఫస్టుంటారన్నది నిర్వివాదాంశం. పురుషులైనా, మహిళలైనా..గెలుపు గుర్రాలకే టిక్కెట్లని చంద్రబాబు ఇప్పటికే స్పష్టం చేశారు కాబట్టి? పార్టీ సర్వేల ఆధారంగానే కడపకోటలో ఎవరు పోటీచేస్తారనేది తేలనుంది. చంద్రబాబు కడప పర్యటన తర్వాత? ఈ విషయంలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని టీడీపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# కళ్లాల్లో నీళ్లు.. కళ్లల్లో కన్నీళ్లు.

ఒంగోలు, డిసెంబర్ 12, మాండౌస్ తుపాను ధాటికి కురిసిన వర్షం ఆంధ్రప్రదేశ్ లో బీభత్సం సృష్టించింది. ఏపీ తీరంపై తుపాను ప్రభావం భారీగానే ఉంది. చేతికొచ్చిన పంట దెబ్బతినడం.. వరి కుప్పలు తడిసి ముద్దవడంతో అన్నదాత ఆవేదనచెందుతున్నాడు. అటు రాకాసి అలలు తీరాన్ని కోసేస్తున్నాయి. అకాల వర్షం రైతన్నకు గుండెకోత మిగిల్చింది. పంట చేతికొచ్చిన సమయంలో మాండూస్ తుఫాను అపార నష్టాన్ని కలిగించింది. కోస్తా తీరం వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. తుపాన్ వల్ల గన్నవరం నియోజకవర్గం ఉంగుటూరు మండలం రైతుల్లో ఆందోళన నెలకొంది. పొలాలు నీట మునిగాయి. నీటిలో నాని, పంట నుంచి మొక్కలు వస్తున్నాయి. ధాన్యం పోయడానికి సంచులు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌బీకే సంచులు తక్కువ ఇవ్వడంతో రోడ్లపైనే ధాన్యాన్ని పోశారు. కృష్ణా జిల్లా దివిసీమలో వేలాది ఎకరాల్లో వరిపంట నేలకొరిగింది. అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, మోపిదేవి , చల్లపల్లి , ఘంటసాల మండలాల్లో సుమారు 6 వేల ఎకరాల్లో పంట నాశనం అయింది. వర్షపు నీరు కూడా బయటకు పోయే అవకాశం లేకపోవడంతో వరి గింజలు కుళ్ళిపోయి మొలకలు వస్తాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి రైతులందరికీ న్యాయం చేయాలని కోరుతున్నారు. ప్రకాశం జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉంది. తోకపల్లి గ్రామంలో పలు ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చి చేరింది. పెద్దారవీడు, మార్కాపురం మండలాలలోని పొలాలలో నిరు నిలబడడంతో మిర్చి పంట దెబ్బతిన్నది. కాకినాడ జిల్లా ఉప్పాడ సముద్ర తీరంలో అలల ఉధృతి భారీగా ఉండి బీచ్ కొతకు గురైంది. ఉప్పాడ-కాకినాడ మధ్య కోతకు గురై రాకపోకలు ఆగిపోయాయి. రాకాసి అలల తాకిడికి ఉప్పాడ, సూరడ పేట, మాయా పట్నం, కొనపాపేట దగ్గర ఒడ్డు భారీగా కోతకు గురై మత్స్యకార గృహాలు సముద్రంలో కలిసిపోయాయి. గతంలో కోట్ల రూపాయలతో రక్షణగా వేసిన జియో ట్యూబ్ పూర్తిగా సముద్రంలో కలిసిపోయిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు.. ఈ నెల 15న ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇప్పటికే మాండూస్ తుఫాన్ ప్రభావంతో నేడు, రేపు తెలుగు రాష్ట్రాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.



# ఐఏఎస్ ల మధ్య కోల్డ్ వార్

విజయవాడ, డిసెంబర్ 13,ఏపీ సెక్రటేరియట్ ఐఏఎస్‌ల మధ్య ఆధిపత్య పోరుకు వేదిక కాబోతోందా?పాలన సజావుగా సాగుతుందా?లేక పాత పద్ధతిలోనే వెళ్తుందా?అధికారుల మధ్య సమన్వయం కొరవడితే పరిస్థితి ఏంటి?ప్రజలకు మెరుగైన పాలన అందించాలనుకునే సర్కార్ లక్ష్యం నెరవేరుతుందా?ఏపీ సెక్రటేరియట్‌లో ఐఏఎస్ అధికారుల మధ్య కోల్డ్ వార్ మొదలైంది. సీఎస్‌గా జవహర్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. దీనిపై సెక్రటేరియేట్‌లో ఎలాంటి చర్చా లేదు. ఐతే?ఎవ్వరూ ఊహించని విధంగా సీఎంఓలోకి పూనం మాలకొండయ్య వెళ్లడమే ఇప్పుడు చర్చకు దారి తీస్తోంది. పూనం మాలకొండయ్య జవహర్ రెడ్డికి రెండేళ్లు సీనియర్. ఆమె సీనియరే అయినా..ఆమె పేరు సీఎస్ రేసులో పెద్దగా వినిపించలేదు. అలాగని సీఎంఓలోకి వెళ్తారనే ప్రచారమూ జరగలేదు. ఈ క్రమంలో ఆమె పేరు సీఎంఓలోకి ఖరారు కావడం ఐఏఎస్ సర్కిల్స్‌లో చర్చకు దారితీసింది. గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతలు పూనం మాలకొండయ్య మీద విమర్శలు చేశారు. వైద్యారోగ్య శాఖలో మెడ్ టెక్ జోన్ విషయంలో జరిగిన భారీ స్కామ్ గురించి విమర్శలు గుప్పించారు. దీనికి కొనసాగింపుగానే..జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చిన కొత్తలో కొన్ని మార్పులు చేర్పులు జరిగాయి. అందులో భాగంగానే జవహర్ రెడ్డి వైద్యారోగ్య శాఖకు వచ్చారు. మెడ్ టెక్ జోన్ విషయానికి సంబంధించి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు జవహర్ రెడ్డి. నాటి మెడ్ టెక్ జోన్ సీఈఓగా ఉన్న జితేంద్ర శర్మకు దాదాపు అధికారాలు కట్ చేస్తూ జీవోలు జారీ చేశారు జవహర్ రెడ్డి. ఆ జీవో జారీ చేసిన తర్వాత పూనం మాలకొండయ్య, జవహర్ రెడ్డి మధ్య కోల్డ్ వార్ చాలా కాలం నడిచింది. ఒకరి మీద ఒకరు సీఎంకు ఫిర్యాదులు చేసుకోవడం లాంటి పరిణామాలు చోటు చేసుకున్నట్టు అప్పట్లోనే జోరుగా ప్రచారం జరిగింది. ఇక?నాటి నుంచి నేటి వరకు పూనం, జవహర్ రెడ్డి మధ్య సఖ్యత లేదనే భావన చాలా మందిలో ఉంది. ఈ క్రమంలోనే సీఎంఓలో స్పెషల్ సీఎస్ హోదాలో.. అంటే దాదాపు సీఎంఓను లీడ్ చేసే బాధ్యతల్లో పూనం మాలకొండయ్య ఉంటే.. అడ్మిన్ బాస్‌గా జవహర్ రెడ్డి ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఈ రెండు వ్యవస్థల మధ్య చక్కటి వాతావరణం ఉంటే పరిపాలనా సజావుగా సాగిపోతుందంటారు. కానీ గతం తాలుకా ప్రభావం ఇప్పటికీ వీరి మధ్య ఉంటే..పరిపాలనా పరంగా గందరగోళం నెలకొనే పరిస్థితి ఉంటుందంటున్నారు. గతంలో సీఎంఓ ముఖ్యకార్యదర్శి, జీఏడీ సెక్రటరీ హోదాలో ఉన్న ప్రవీణ్ ప్రకాష్‌కు..నాటి సీఎస్ ఎల్వీ సుబ్రమణ్యం మధ్య ఇదే తరహాలో గందరగోళం ఏర్పడింది. అప్పట్లో పరిపాలనా విభాగం చాలా డిస్ట్రబ్ అయ్యింది. ఇప్పుడు మళ్లీ అలాంటి సీనే రిపీట్ అయితే ఇబ్బంది వస్తుందనే చర్చ జరుగుతోంది. గతంలో ప్రవీణ్ ప్రకాష్-ఎల్వీ ఎపిసోడ్‌కు..ఇప్పటికీ చాలా తేడా ఉందనే వాదనా వినిపడుతోంది. గతంలో ఎల్వీ సుబ్రమణ్యానికి.. సీఎం జగన్‌కు మధ్య గ్యాప్ రావడం వల్ల గందరగోళం నెలకొందని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడా పరిస్థితి లేదని.. జవహర్ రెడ్డి సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్నారని?పైగా సొంత జిల్లా కావడంతో వీసమెత్తు కమ్యూనికేషన్ గ్యాప్ అనేదే ఉండదని అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సీఎంఓకు..సెక్రటేరియేట్‌కు మధ్య గ్యాప్ కానీ..వేరే విధమైన పొరపొచ్చాలు కానీ తలెత్తే అవకాశం ఉండదనేది మరో వాదన.

# ఉక్కు పరిశ్రమ పై సియం వైఎస్ జగన్ మోసపూరిత మాయాజాలం



కడప మూడేళ్లల్లో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పి శంకుస్థాపన చేసిన సియం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మూడేళ్ల గడుస్తున్న ఇంతవరకు నిర్మాణం చేపట్టని నేపథ్యంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పాదయాత్రతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త ప్రతిపాదనలతో, ఒప్పందాలతో జనాన్ని మభ్యపెట్టే తంతు తెరపైకి తెచ్చిందని ఇది ప్రజలను మోసం చేయడం తప్ప మరో సదుద్దేశం లేదని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు,

## మూడేళ్లుగా ఆచరణలో లేని సియం మాటలు ....

## -సిపిఐ నగర కార్యదర్శి యన్ వెంకట శివ,...

కడప నగర కార్యదర్శి యన్ వెంకట శివ పేర్కొన్నారు. మాట తప్పం, మడమ తిప్పమని 2019 డిసెంబర్ 23న కడప ఉక్కు ఫ్యాక్టరీకి సియం వైఎస్ జగన్ శంకుస్థాపన చేశారని చెప్పారు నామ మాత్రంగా నిధులు విడుదల చేశారని చెప్పారు అరకొరా ప్రహరి గోడ నిర్మాణానికి మాత్రమే మూడేళ్లు పట్టిందా అని విమర్శించారు. గతంలోనూ ఏఎస్ ఆర్ స్టీల్ కంపెనీతో ఒప్పందం చేసుకొన్న ప్రభుత్వం, నిర్మాణం చేపట్టకుండానే ఆ కంపెనీ పత్తా లేకుండా పోయిందన్నారు. ఈనెల 23వ తేదీకి శంకుస్థాపన చేసే మూడేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో, కడప ఉక్కు -ఆంధ్రుల హక్కుగా సిపిఐ రాష్ట్ర వ్యాప్త ఉద్యమంగా మలచి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ నేతృత్వంలో పాదయాత్ర చేస్తున్న సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం తిరిగి కొత్త పల్లవిని అందుకోవడం మరో నయవంచన తప్ప మరేమి లేదన్నారు. మూడేళ్ల కిందటనే 3,591.65 ఎకరాల్లో 11,606 కోట్ల రూపాయలతో పరిశ్రమ ఏర్పాటు చేయడానికి అంచనా వేయగా ఇప్పుడు జె ఎస్ డబ్ల్యూ గ్రూప్ సంస్థ 8,800 కోట్ల రూపాయలతోనే ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఆమోదం తెలపడం పట్ల అనుమానాలున్నాయన్నారు. వైయస్సార్ స్టీల్ కార్పొరేషన్ కోసం తీసుకున్న భూములకు సంబంధించి బాధిత రైతులకు ఇప్పటికీ దాదాపు 30 కోట్ల రూపాయలు పైగా పరిహారం చెల్లించలేని దౌర్భాగ్య స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. సీఎం జగన్ కాపట నాటకాలు పక్కన పెట్టి విభజన చట్టంలో ఉన్న కడప ఉక్కు పరిశ్రమపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్రభుత్వ రంగ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు చిత్తశుద్ధి ప్రదర్శించాలన్నారు. జగన్ పదేపదే మోసపూరిత మాటలను నమ్మే పరిస్థితుల్లో నిరుద్యోగ యువత,ప్రజలు లేరన్నారు గత టిడిపి ప్రభుత్వ హయంలో రాష్ట్రం ఎలాంటి అభివృద్ధి కి ప్రాజెక్టుల నిర్మాణానికి నోచుకోలేద కనుకనే మాజీ ముఖ్యమంత్రి తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ను రాష్ట్ర ప్రజలు గద్దె దించారని చెప్పారు ఇప్పటికైనా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉక్కు పరిశ్రమ ను నిర్మించి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని హితవు పలికారు.

# పేద విద్యార్థుల ను బానిసలుగా మార్చేందుకు బిజెపి ప్రభుత్వం కుట్ర



కడప సిటి డిసెంబర్ 13 కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బలహీన వర్గాల విద్యార్థులకు,1 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న మైనారిటీ విద్యార్థులకు ఇచ్చే ప్రీ-మెట్రిక్ ప్రదానం'షిప్‌లను ఆకస్మికంగా కేంద్రం నిలిపివేయడం దారుణమని మంగళవారం కడప ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్ఆర్సి (జేఏసీ) కన్వీనర్ సయ్యద్ అహమ్మద్ బాబు బాయ్, ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మక్బుల్ భాష, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ లు మాట్లాడుతూ, గతంలోయుపిఎ అధికారంలో ఉన్న 2006-2007 నుండి మైనారిటీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న ప్రీ-మెట్రిక్ డిగ్రీషిప్‌ను రద్దు చేయడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వారు ఖండించారు. కేవలం మతమే అజెండాగా బిజెపి ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ ముస్లిం ఓ బి సి విద్యార్థులై ఎక్కువగా నష్టపోతారని వారన్నారు. భారత రాజ్యాంగంలోని ఆదేశానుసారం కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తుందని వారన్నారు. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని వారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఇచ్చే మౌలానా ఆజాద్ స్కాలర్షిప్ వ్యవస్థనే కేంద్ర ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసింది ఈ విషయంపై కేంద్ర మైనార్టీ శాఖ మంత్రి సుష్మఇరానీ పార్లమెంట్లో మాట్లాడుతూ మనది లౌకిక రాజ్యము విద్యార్థులు అందరినీ ఒకేలా టీడ్ చేయాలి కావున మిగిలిన విద్యార్థులు అందరిని ఇచ్చినటువంటి స్కాలర్షిప్లను మైనార్టీలకు ఇస్తాము మైనారిటీలకు ఇచ్చేది ఏమీ లేదు అనే విధంగా వాళ్ళు చెప్పడం జరిగింది అని వారన్నారు. మరి మైనార్టీల వచ్చే సంపద సంబంధించిన డబ్బులు అన్ని ఇతర వాటికి ఖర్చు పెట్టడం ఎంతవరకు సమంజసం సుష్మ ఇరానీ అని వారన్నారు. ప్రీ-మెట్రిక్ రద్దు చేయడానికి విద్యా హక్కు చట్టం (ఆర్‌టిఐ) అమలు చేయడం వల్ల విద్యార్థులకు ఇప్పుడు అన్ని సౌకర్యాలు లభిస్తాయని వారు అన్నారు. దీనిని నిలిపివేయడం వల్ల

## విద్యార్థులకు రద్దు చేసిన పథకాలన్నీ అమలు చేయాలి

## ఎన్ ఆర్ సి( జేఏసీ) ఆప్ కి అవాజ్ డిమాండ్

ప్రైవేట్ లేదా అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో అధిక ఫీజులను భరించలేని పిల్లలలోపౌట్ రేట్లు పెరుగుతాయని, అందువల్ల వారి ప్రాథమిక విద్యా హక్కును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ను పొందేందుకు విద్యార్థుల కుటుంబాలు వివిధ ఫార్మాలిటీలను పూర్తి చేసిన తర్వాత కేంద్రం నోటీసు వచ్చిందని, తక్షణమే ఈ చర్యను ఉపసంహరించుకునేలా ప్రధాని జోక్యం చేసుకోవాలని వారు కోరారు. బిజెపి మత పాలనను నిరోధిస్తూ ఉద్యమాలు చేస్తామన్నారు,వెంటనే స్కాలర్షిప్ లన్ని పునర్వించాలని కేవలం బలహీన వర్గాలను అనగదొక్కటానికే తప్ప పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే దురాలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉందని వారు విమర్శించారు. వెంటనే రద్దు చేసిన పథకాలన్నీ అమలు చేయాలని లేని పక్షంలో సంబంధిత విద్యార్థులతో విద్యార్థి తల్లిదండ్రులతో విద్యార్థి యువజన మైనార్టీ సంఘాలతో కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలోఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి సుబ్బరాయుడులు ఎన్ ఆర్ సి జేఏసీ నాయకులు హిదాయత్ పాల్గొన్నారు.

# నేడు అంతర్జాతీయ కోతుల దినోత్సవం

అంతర్జాతీయ కోతుల దినోత్సవాన్ని ప్రతీ సంవత్సరం డిసెంబరు 14న జరుగుతుంది. మిచిగాన్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించిన కేసీ సారో, ఎరిక్ మిల్లికిన్ కళాకరులు 2000 సంవత్సరంలో ఈ దినోత్సవాన్ని మొదటి సారి ప్రకటించి,దానిని ప్రపంచానికి తెలిసేలా ప్రచార వ్యాప్తికి కృషి చేసారు. ఈ కోతుల దినోత్సవాన్ని అంతర్జాతీయ కోతుల దినోత్సవం" గా కూడా పిలుస్తారు. సాధారణంగా పగటిపూట చెట్లపై నివసించే కోతులను ప్రైమేట్స్ అని పిలుస్తారు. ప్రపంచవ్యాప్తంగా, దాదాపు 260 వివిధ కోతుల జాతులు ఉన్నాయి. శాస్త్రవేత్తలు కోతులను రెండు వేర్వేరు వర్గాలుగా వర్గీకరిస్తారు: ఆసియా మరియు ఆఫ్రికాలో కనిపించే పాత ప్రపంచంలోని కోతులు మరియు అమెరికాలో కనిపించే కొత్త ప్రపంచంలోని కోతులు.

# సొంత ఇల్లు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పులివెందుల పులివెందుల మున్సిపల్ కార్యాలయంలో జగనన్న కాలనీ లేఅవుట్ లో గృహాలు మంజూరైన లబ్ధిదారులకు, డ్వాక్రా మహిళలకు 35 వేల రూపాయలు రుణాలు మంజూరు చేయడానికి కన్వర్జెన్సీ బ్యాంకులు సమావేశాన్ని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రామ్మోహన్ రెడ్డి అధ్యక్షతన స్థానిక మునిసిపల్ కార్యాలయం లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ సొంత ఇల్లు కలిగి ఉండాలని ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ జగనన్న కాలనీ లేఔట్ నందు పలు రకాల అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన చేయడం జరుగుతుందని కాలనీ అందంగా సౌకర్యవంతంగా విలాసవంతంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మాణం జరుగుతున్నదని వివరించారు లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ట్ మేనేజర్ మాట్లాడుతూ 35 వేల రుణాలు మంజూరు చేయుటకు బ్యాంకులు తక్షణమే చర్యలు తీసుకోవాలని సాంకేతిక సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. గృహ నిర్మాణాలకు బ్యాంకు రుణాలు 35 వేల రూపాయలను మంజూరు చేయుటకు పాడా తరపున సమన్వయ అధికారిగా నియమించబడిన ఆంజనేయులు మాట్లాడుతూ మెప్మా రిసోర్స్ పర్సన్ లు మరియు మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు ప్రణాళికయుతంగా సంఘం తీర్మానాలను బ్యాంకులను సమన్వయం చేసుకోవాలని సూచించారు వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్లు వారికి కేటాయించిన లాగిన్లలో 35 వేల రూపాయలు పొందిన వారి వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని అన్ని బ్యాంకు మేనేజర్లు మెప్మా మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు నాయుడు, నాగన్న హరిత మెప్మా రిసోర్స్ పర్సన్ లు పులివెందుల మున్సిపాలిటీలోని వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# నేడు జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం

జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఈ దినోత్సవాన్ని డిసెంబరు 14వ తేదీన నిర్వహించబడుతుంది. ఇంధనాన్ని పొదుపు చేయాల్సిన ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన కలిగించడానికి ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1991లో ఈ జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం ప్రారంభించబడింది. 2001వ సంవత్సరంలో భారత ప్రభుత్వ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ ఇంధన పొదుపు చట్టాన్ని తీసుకురావడమేకాకుండా, ప్రతి సంవత్సరం జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం నిర్వహిస్తుంది. జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సభలు, సమావేశాలు నిర్వహిస్తారు. ఇంధన పరిరక్షణ అంశంపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. 1991వ సంవత్సరం నుండి కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ దినోత్సవం రోజున ఇంధన పరిరక్షణకు కృషి చేసిన వివిధ పరిశ్రమలు కంపెనీలకు అనగా ఇండస్ట్రియల్ యూనిట్లకు, హోటళ్ళకు, ఆసుపత్రి భవనాలకు, కార్యాలయాలకు, షాపింగ్ మాల్ బిల్డింగులకు, జోనల్ రైల్వే, రాష్ట్ర సంబంధ ఏజెన్సీలు, మున్సిపాలిటీలు, థర్మల్ పవర్ స్టేషన్లు కు జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డు అందజేస్తున్నారు.

# శ్రీశైలంలో దుకాణాల తరలింపు

శ్రీశైలం శ్రీశైల మహాక్షేత్రంలో ఆలయానికి ఇరువైపుల గల దుకాణాలను ఖాళీ చేయాలని దుకాణదారులకు దేవస్థానం అధికారులు ఆదేశించారు 125 పాత దుకాణాలను లలితాంబికా షాపింగ్ కాంప్లెక్స్ లోకి త్వరగతిన తరలించుకోవాలని సూచనలు చేశారు ఈనెల 16,17,18 వతేదీ లోపు లాలితంబికా కాంప్లెక్స్ లోకి దుకాణాలు తరలించుకోవాలని సమయం ఇచ్చి దేవస్థానానికి సహకరించాలని కోరారు ఇప్పటికే మైక్ అనౌన్స్ ద్వారా కూడా దుకాణదారులకు తెలియజేస్తున్నారు 18 లోపు తరలించకపోతే నీరు,విద్యుత్ నిలిపివేస్తామని హెచ్చరికలు చేశారు అయితే ఇప్పటికే ఏపీ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల మేరకు ఈనెల 3 వతేదీన దుకాణాలకు లక్కీ డిప్పు దేవస్థానం నిర్వహించింది లక్కీ డిప్ లో దేవస్థానం నిర్వహిస్తున్న సమయంలో దుకాణాలు డిప్ లో పాల్గొనని మిగిలిన 39 దుకాణాలకు కూడా ఈనెల 22 న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

## గడప గడపకు నిరసన సెగలు

# ఎదుర్కొంటున్న మాజీ మంత్రి ఆళ్ల నాని

ఏలూరు ఏలూరు ఎమ్మెల్యే మాజీ మంత్రి ఆళ్ల నాని మంగళవారం నాడు 25 డివిజన్ లో 59వ రోజు గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్థానిక ప్రజల వద్ద నుండి పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి, మాకు న్యాయం చెయ్యాలి న్యాయం చెయ్యాలి అంటూ ఫ్లకార్డ్స్ తో మహిళలు స్వాగతం పలికారు. 25వ డివిజన్ కు సంబంధించిన స్థానికులకు ఎక్కడో లక్ష్మీపురంలో జగనన్న ఇళ్లు ఇచ్చారు, మా శనివారపు పేటలో బయట వాళ్లకు స్థలాలు కేటాయించారని, మా డివిజన్లో మాకే స్థలాలు కేటాయించాలని ఎమ్మెల్యేకు ఆందోళనతో 25వ డివిజన్ మహిళలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. పోలీసులు నిరసన చేస్తున్న మహిళలను బలవంతంగా స్టేషన్ కు తరలించారు.

# ఆధార్ కార్డు అప్ డేట్ తప్పనిసరి

## - లేకపోతే ప్రభుత్వ పథకాలకు ఇబ్బంది

## - తహసీల్దార్ చల్లా రామ్మోహన్

కమాన్ పూర్ ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు అప్ డేట్ చేసుకోవలిసిన ఆవశ్యకత ఉందని రామగిరి తహసీల్దార్ చల్లా రామ్మోహన్ అన్నారు. మంగళ వారం రత్నాపూర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ పల్లె ప్రతిమవీరావు తో కల్సి ఆధార్ అనుసంధాన క్యాంపును ఆయన ప్రారంభించారు. ప్రతి ఒక్కరు ఆధార్ కార్డు ఒరిజినల్ తో పాటు లింకు కింద రేషన్ కార్డ్, బ్యాంక్ పాస్ బుక్, ఓటర్ కార్డ్, పాస్ పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్ ( ఒరిజినల్ ఏదైనా ఒకటి) వెంట తీసుకొని వచ్చి లింక్ చేసుకోవాలని కోరారు. వీటితో ఆధార్ లింక్ చేయడం జరుగుతుందని అన్నారు. ఆధార్ లింకు లేకపోతే ప్రభుత్వ పథకాలైన పెన్షన్, రేషన్, ఇతర పథకాలు ఆగిపోయే అవకాశం ఉందని అన్నారు.. ఆధార్ లింక్ 42 శాఖలకు అనుసంధానం జరుగుతుందని తెలిపారు. 2013-15 మధ్య ఆధార్ దిగినవారు,తప్పక ఆధార్ లింక్ చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దుబ్బాక సత్య రెడ్డి, ఆర్.ఐ లు దుసా.సతీష్, పి.సంపత్, సెక్రెటరీ పెండ్లి రమ్య, ఆధార్ కేంద్ర నిర్వాహకులు ముడుసు.శ్రీనివాస్,కారోబార్ కొండపర్తి.శ్రీనివాస్,నాయకులు సందేవేన కుమార్,చిందం.రమేష్,ఇజ్జగిరి.వెంకటేష్,బెజ్జల సంజీవ్,బెజ్జల.ప్రభాకర్,కే. ఎన్. చారి,గాదె మొండయ్య, తన్నీరు.ప్రదీప్, సంఘమిత్ర సంపత్ రెడ్డి,ఖండే సంజీవ్ పాల్గొన్నారు.

# ఎన్ని ప్రభుత్వాలు మారినా మత్స్యకారుల బ్రతుకులు మారలేదు

## జాతీయ మత్స్యకారుల యువజన విభాగం జిల్లా అధ్యక్షులు బెస్త సురేష్

నంద్యాల :- మంగళవారం నాడు వెలుగోడు తెలుగుగంగ రిజర్వాయర్ లో గంగమాతకు స్థానిక మత్స్యకారులు పేద్ద ఏత్తున పూజలు నిర్వహించారు .అనంతరం సురేష్ మాట్లాడుతూ సాంప్రదాయ మత్స్యకారులు విద్య,ఉద్యోగ,రాజకీయ రంగాల్లో వెనకబడ్డరని వైసిపి ప్రభుత్వం సాంప్రదాయ మత్స్యకారుల అబివృద్దికి కృషిచేయలని అందులొ బాగంగ వారి అబివృద్దిని దృష్టిలో ఉంచుకొని మత్స్యకారులకు బోట్లు,వలలు,టివిఏస్ మోపేడ్లు,మోబైల్ మార్కేటింగ్ వాహనాలతొ పాటు ఐసుప్లాంటు ఏర్పాటు చేయాలని కోరారు , అలాగే చేపల రవాణా సౌకర్యం కొసం ఐసో లేషన్ బండ్లు ఇవ్వలని,మత్స్యకారుల పిల్లలు విద్యలో వెనకబడి ఉన్నందున వారికి గురుకుల పాఠశాల ఏర్పాటు చేసి విద్యలో ప్రోత్సహించలని,మత్సకారుల అబివృద్దికి మారుతున్న సామజానికి అనుగుణంగ అదునుతనమైన శిక్షణ తరగతులు ఏర్పాటు చేయలని,అలాగే గతంలో వెలుగోడు రిజర్వయర్ లో బోటు తిరగబడి బార్యభర్తలు మరణించి పిల్లలు అనాదలాయ్యరని అలాంటి సంగటనలు జరిగినప్పుడు ప్రభుత్వం స్పందించి వెంటనే ప్రమాదబీమ అందివ్వలని అలాగే అనాథలైన పేద బిడ్డలను ప్రభుత్వం అదుకోవాలని కోరారు .ఎన్ని పార్టిలు మారిన మత్స్యకారుల బతుకులు మారటం లేదని అయన అవేదన వ్యక్తం చేశారు..ఈ కార్యక్రమంలో స్థానిక సాంప్రదాయ మత్స్యకారులు పేద్ద ఏత్తున పాల్గొని గంగమాతకు పూజలు నిర్వహించారు..



# బీసీ హక్కుల సాధనకై చలో కర్నూల్



## బీసీలకు 56 కార్పొరేషన్ నిధులు మంజూరు చేయాలి ప్రభుత్వాలు మారినా బీసీల తలరాతలు మారవు



నందికొట్కూరు డిసెంబర్ 13నందికొట్కూరు పట్టణంలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం దగ్గర ఈనెల 19వ తేదీ సోమవారం జరిగే హలో బిసి చలో కర్నూల్ రిలే నిరాహారదీక్షను జయప్రదం చేయాలని కోరారు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేంపెంట రాంబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ కార్యక్రమంలో వేంపెంట రాంబాబు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షులు చింతకుంట కురుమూర్తి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చి నాలుగు సంవత్సరాలు కావస్తున్న బీసీలకు బడ్జెట్ కేటాయించకపోవడం దురదృష్టకరమన్నారు. 139 56 కార్పొరేషన్ డైరెక్టర్లు చైర్మన్లు ఏర్పాటు చేశారని వాటికి ఇంతవరకు బడ్జెట్ కేటాయించలేదని తెలిపారు. దీక్షలకై ప్రతి నియోజకవర్గంలో,ప్రతి జిల్లాలో బిసి భవనం ఏర్పాటుకు జీవో ఉన్న అమలుపరచలేదని బిసి భవనాలను ఐదుకోట్లతో కేటాయించి నిర్మాణం పనులు చేపట్టాలని కోరారు.56 బీసీ కార్పొరేషన్లకు ఒక్కోక్క కార్పొరేషన్ కు 500 కోట్ల నిధులు కేటాయించాలి.ఆగిపోయిన బిసి భవనాలను యుద్ధ ప్రాతిపదికన నిర్మాణం చేపట్టాలిస్థానిక సంస్థల్లో 24 శాతం నుండి 56 శాతానికి బీసీలకు రిజర్వేషన్ కల్పించాలిబీసీలకు కుల గణన ఏర్పాటు చేయాలి బీసీలకు చట్టసభల్లో 50% రిజర్వేషన్ కల్పించాలి,బీసీ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలి, పీజీ చేసే బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ కొనసాగించాలి,పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మిస్ చార్జీలు మరియు కాస్మొటిక్ చార్జీలు పెంచాలి, బీసీ సమస్యలపై బడుగు బలహీన వర్గాలు బీసీలందరూ పెద్ద ఎత్తున నందికొట్కూరు పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలందరూ రావాలని కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు గోకారి సిడి ఆంజనేయులు కృష్ణ, కృష్ణమూర్తి, శ్రీనివాసులు ఆర్ఎంపి శ్రీనివాసులు జాతీయ బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు నాగరాజు, పగడాల మండలం అధ్యక్షులు బలరాముడు, గుడుసాహేబ్,బుడగ జంగాల వెంకటేశ్వర్లు, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

# చలాన్ల దెబ్బకు బెంబేలెత్తిపోతున్నా

## ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రజలుటిడిపి కార్యదర్శి నవాజ్

ఎమ్మిగనూరు పట్టణంలో డిసెంబర్ 13 మంగళవారం నాడు పోలీసు వారు విధిస్తున్న చలాన్ల దెబ్బకు గ్రామాల నుండి పట్టణానికి ప్రజలు రావాలంటే భయపడుతున్నారని నవాజ్ విలేకరుల సమావేశంలో అన్నారు.ఈ జగన్ ప్రభుత్వం ప్రజల దగ్గర నుంచి ఏ విధంగా డబ్బులు లాగాలో ఆ విధంగా లాగేసుకుంటుందని నవాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు రాష్ట్రంలో ఒక్కొక్క తాలూకా నుంచి లక్ష రూపాయలు టార్గెట్గా పెట్టి ప్రజల సొమ్మును పోలీసు ద్వారా చలాన్ల రూపంలో లాగేసుకుంటుందని నవాజ్ అన్నారు అదే మాదిరిగా పోలీస్ శాఖ కూడా ఈ విధించిన టార్గెట్ కోసం ఏం చేయాలో తోచక రాత్రి 9 గంటల వరకు కూడా చలాన్లు విధిస్తున్నారని ఈ దెబ్బకు పట్టణ ప్రజల మరియు గ్రామీణ ప్రజలు వాహనాలు ఇంటి నుండి బయటికి తీయాలంటే ఆలోచిస్తున్నారని నవాజ్ అన్నారు. అన్ని శాఖల నుండి ఏదో ఒక కారణం చూపించి ప్రజల సొమ్మును ఈ ప్రభుత్వం లాగేసుకుంటుందని ఇకనైనా రాబోయే ఎన్నికల్లో మనకు ఈ ఖర్మ ను పట్టించిన ఈ ప్రభుత్వాన్ని ప్రజలు పారదోలాలని ఇందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని నవాజ్ తెలిపారు..



# రైల్వే కోడూరు లోగడపగడపకు మన ప్రభుత్వం ....

. రైల్వే కోడూరు డిసెంబర్ 13 : రైల్వే కోడూరు మండలంలోని వెంకట రెడ్డి పల్లి గ్రామ సచివాలయ పరిధిలో వడ్డిపల్లి, అరుంధతి వాడలనందు సర్పంచ్ నాయని.హరికృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, ప్రజల నుంచి వస్తున్న వినతులను, సమస్యలను అప్పటికప్పుడు సంబంధిత అధికారులతో పరిష్కార దశగా చర్చిస్తూ, పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను ప్రభుత్వ విప్, శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధ్వజ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి,జెడ్పీటీసీ రత్నమ్మ, ఉప సర్పంచ్ తోట శివ సాయి, మార్కెట్ యార్డు చైర్మన్ సుబ్బ రామ రాజు, మండల కన్వీనర్ సుధాకర్ రాజు, చైతన్య రాజు, నాగేశ్వరరావు, ఏమేశ్వర్ రెడ్డి, గురివి రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, సుబ్బరామిరెడ్డి,తేజ రెడ్డి,ఎంపిడివో నాగార్జున,ఎంపిటిసిలు,సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



# తుఫాన్ వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి....

## షేక్ సైదా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి.



బద్వేలు , గత ఆరు రోజులుగా రాష్ట్రంలో కుండపోతగా కురుస్తున్న వర్షాలు మూలంగా దాదాపు 20 లక్షల ఎకరాలు నీట మునిగి సుమారు 2000 కోట్ల రూపాయల పంట నష్టం జరిగిందని ప్రభుత్వం వెంటనే అన్నదాతలను ఆదుకోవాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి షేక్ సైదా నేడు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. మండౌస్ తుఫాన్ కారణంగా రాష్ట్రంలోని పలు జిల్లాలలో వరి ,మినిము,బొబ్బర్లు, పొగాకు, మిర్చి, బొప్పాయి ఇతర ఉద్యాన పంటలు, కూరగాయ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి,ఒక ప్రకాశం జిల్లాలోని లక్ష ఎకరాల్లో వివిధ పంటలు పూర్తిగా నీటిలో మునిగిపోయి పంట నష్టం సంభవించింది.ప్రకాశం జిల్లాలో టంగుటూరు మండలానికి చెందినటువంటి వెంకట్రావు అనే రైతు తను వేసిన 11 ఎకరాల పొలంలో పంట నష్టపోవడంతో కలత చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేశాడని ఆయన అన్నారు.వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదికలు అందజేయాలని ఆయన కోరారు, ఒక్కొక్క ఎకరాకి సుమారుగా 10000 నుండి లక్ష రూపాయల వరకు రైతులు నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు

# వీరయ్య కోసం శ్రీదేవిలా మారిన శృతి హాసన్..!

ఇండియన్ స్క్రీన్ మీద తన అందం అభినయంతో మెప్పించిన అతిలోక సుందరి శ్రీదేవి. ఆమె చేసిన సినిమాలు ఎప్పటికీ ఆమెని ప్రత్యేక స్థానంలో ఉండేలా చేశాయి. అలాంటి శ్రీదేవిని సాధ్యమైనంతవరకు అడపాదడపా గుర్తు చేసుకుంటూ ఉంటారు. ప్రత్యేకంగా పాటల్లో అక్కడక్కడ శ్రీదేవి పేరు వినిపిస్తోంది. ఇక లేటెస్ట్ గా మరోసారి శ్రీదేవి పేరు మీద ఒక పాట వస్తుంది. అది కూడా మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న వాల్తేరు వీరయ్య సినిమాలో శ్రీదేవి పేరుతో ఒక పాట కంపోజ్ చేశారు.ఇంతకీ ఆ సాంగ్ లిరిక్ ఏంటి అంటే నువ్వు శ్రీదేవి అయితే.. నేను చిరంజీవి అవుతా అని వస్తుందట. అక్కడ చిరంజీవి అవడం కాదు చిరంజీవే ఉన్నాడు కాబట్టి శ్రీదేవిగా శృతి హాసన్ కనిపిస్తుంది. చిరంజీవి శ్రీదేవి కాంబో సూపర్ హిట్. వాళ్లిద్దరు కలిసి చేసిన జగదేక వీరుడు అతిలోక సుందరి సినిమా అప్పట్లో ఒక పెద్ద సెన్సేషన్ ని క్రియేట్ చేసింది. అబ్బని తీయని దెబ్బ సాంగ్ అయితే ఇప్పటికీ ఎక్కడో ఒక చోట వినిపిస్తుంది. ఆ రిఫరెన్స్ తోనే వాల్తేరు వీరయ్యలో శృతి హాసన్ ని శ్రీదేవిని చేసేస్తున్నారు మేకర్స్.ప్రస్తుతం యూరప్ లో వాల్తేరు వీరయ్య సాంగ్ షూటింగ్ జరుపుకుంటున్నాయి. రెండు సాంగ్స్ ని అక్కడే షూట్ చేస్తారని తెలుస్తుంది. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో ఈ సాంగ్స్ కంపోజింగ్ జరుగుతుంది. కొన్నాళ్లు కెరీర్ లో గ్యాప్ తీసుకున్నా మళ్లీ తెలుగులో సూపర్ బిజీ అయ్యింది శృతి హాసన్ ఈసారి సీనియర్ స్టార్స్ తో కూడా అమ్మడు నటించేస్తుంది. సంక్రాంతికి వాల్తేరు వీరయ్యతో పాటుగా వస్తున్న బాలకృష్ణ వీర సింహా రెడ్డిలో కూడా శృతి హాసన్ హీరోయిన్ గా నటిస్తుంది.సంక్రాంతికి తన సినిమాల మధ్య ఆసక్తికరమైన ఫైట్ ని ఆస్వాధించాలని ఫిక్స్ అయ్యింది శృతి హాసన్. మరి వాల్తేరు వీరయ్యలో శ్రీదేవి పాటలో శృతి హాసన్ శ్రీదేవిని దించేసిందా లేదా అన్నది తెలియాలంటే సినిమా వచ్చే దాకా వెయిట్ చేయాల్సిందే. దేవి శ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజైన బాస్ పార్టీ అదిరిపోగా మరో సాంగ్ రిలీజ్ కు రెడీగా ఉంది.



# మెగా నిర్మాత విడుదల చేసిన '18 పేజెస్' ఏడు రంగుల వాన...

నిఖిల్ సిద్ధార్థ్ అనుపమ పరమేశ్వరన్ లు జంటగా నటించిన "18 పేజెస్" సినిమా డిసెంబర్ 23న రిలీజ్ కాబోతున్న విషయం తెల్సిందే. కార్తికేయ 2 సినిమా తో పాన్ ఇండియా హిట్ అందుకున్న హీరో నిఖిల్ సిద్ధార్థ్ మరియు అనుపమ పరమేశ్వరన్ జంటగా రూపొందిన ఈ సినిమా ను మెగా నిర్మాత అల్లు అరవింద్ సమర్పిస్తున్నాడు. బన్నీ వాసు నిర్మాణంలో పల్నాటి సూర్య ప్రతాప్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. ఇటీవలే ఈ చిత్ర టీజర్ మరియు పాట టైం ఇవ్వు పిల్ల అనే పాటలకు ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ రెస్పాన్స్ దక్కించుకుంది.ఇప్పుడు సిద్ శ్రీరామ్ పాడిన పాట ఏడు రంగుల వాన విడుదల అయ్యింది. గోపి సుందర్ మ్యూజికల్ లో శ్రీమణి రాసిన ఈ "ఏడు రంగుల వాన" పాటను మీడియా సమావేశంలో చిత్ర సమర్పకులు అల్లు అరవింద్ రిలీజ్ చేశారు.ఏడు రంగులు వాన.. రెండు కళ్ళల్లోన కారణం ఎవరంటే. అక్షరాలా నువ్వే ఇన్ని నాల్లుగా ఉన్నా ఇప్పుడే పుడుతున్నా.. కారణం ఎవరంటే.. కచ్చితంగా అది నువ్వే.. అంటూ సాగే ఈ పాట ప్రతి ఒక్కరి హృదయాలను టచ్ చేస్తుంది అంటూ అల్లు అరవింద్ అభిప్రాయం వ్యక్తం చేశారు. మేము తీసిన "18 పేజెస్" సినిమా ఒక సాధారణ మైన లవ్ స్టోరీ కాదు. చాలా డిఫరెంట్ గా ఉంటుంది. గోపి గారు ఇప్పటి వరకు మా బ్యానర్ ఏడు సినిమాలు చేశాడు. ఈ సినిమాకు కూడా అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు.కార్తికేయ 2 సినిమా తరువాత అదే జోడీతో ఈ 18 పేజెస్ సినిమా రావడం చాలా హ్యాపీ గా ఉంది. నిఖిల్ చాలా డెడికేటెడ్ గా వర్క్ చేస్తాడు. ఈ సినిమాలో అందరూ చాలా బాగా నటించారు. ఈ నెల 23 న వస్తున్న మా చిత్రాన్ని అందరూ ఆదరించి ఆశీర్వదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు.బన్నీ వాసు మాట్లాడుతూ.. హీరో నిఖిల్ కు సినిమా మీద మ్యూజిక్ మీద చాలా నాలెడ్జ్ ఉంది. జానపద పాటలు రాసే తిరిపతి గారిని ఈ సినిమాతో లాంచ్ చేస్తున్నాము. ఈ సినిమాలో తను మంచి పాట రాశారు. ఆ పాటను ఈనెల 14 న రిలీజ్ చేస్తున్నాము. డిసెంబర్ 23 న ప్రేక్షకుల ముందుకు వస్తున్న మా చిత్రాన్ని అందరూ ఆదరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు.

# రమా రాజమౌళిని ఆకాశానికి ఎత్తేసిన 'ది హాలీవుడ్ రిపోర్టర్'!

నేడు రాజమౌళి ప్రతిభ పాన్ ఇండియాని దాటి పాన్ వరల్డ్ కి చేరిందంటే? అందుకు ఆయనొక్కడే కారకుడు కాదు. ఆయన వెనుక మరకో ఇద్దరు బమలైన వ్యక్తులు ఉన్నారన్నది వాస్తవం. వాళ్లే తండ్రి విజయేంద్ర ప్రసాద్.. రాజమౌళి లో సగభాగం అయిన సతీమణి రమా. వీరిద్దరు లేనిదే రాజమౌళి లేరు. అతని సినిమాలు లేవు అన్నది వాస్తవం. రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు అన్న చందంగా రాజమౌళితో పాటు ఆ ఇద్దరు కలిస్తేనే ఒక బాహుబలి లాంటి విజువల్ వండర్ వచ్చింది. ఆర్ ఆర్ ఆర్ లాంటి హాలీవుడ్ మెచ్చే గొప్ప చిత్రం రూపుదిద్దుకుంది.ఇంకా జక్కన్న తో పాటు మరెంతో మంది బ్యాకెండ్ పనిచేసారు కాబట్టే నేడు హాలీవుడ్ లో రాజమౌళికి ఓ కుర్చీ వేసి కూర్చోబెట్టారు. రాజమౌళికి దక్కుతోన్న ప్రతీ ప్రశంస..నీరాజనం వెనుకుండి పనిచేసిన వారికి దక్కుతున్నట్లుగానే భావించాలి. రమా రాజమౌళి ట్యాలెంట్..ప్రత్యేకత గురించి టాలీవుడ్ లోనే చాలా తక్కువ మందికి..క్లోజ్ గా అసోసియేట్ అయ్యే వారకే ఆమె సినిమా విషయంలో ఎంతగా ఇన్వాల్వ్ అవుతారన్నది తెలుసు.ఈ విషయాలన్ని రాజమౌళికి తెలుసు. కానీ ఆయనెప్పుడు వాటి గురించి ఎక్కడా ఓపెన్ అవ్వలేదు. అందుకు కారణాలు వ్యక్తిగతగానే భావించాలి. అయితే తాజాగా రాజమౌళి చూపించే ప్రతీ ఫ్రేమ్ లోనూ రమా రాజమౌళి ఉన్నారని హాలీవుడ్ పసిగట్టిందంటే? నమ్ముతారా? నమ్మకపోయినా ఇప్పుడు నమ్మాల్సిన సందర్భం వచ్చింది.అవును రమా రాజమౌళిని ప్రతిభని గుర్తించి ఓ హాలీవుడ్ పత్రిక ఆకాశానికి ఎత్తేసింది. ఆమెలో అసాధారణ ప్రతిభను కొనియాడింది. ప్రముఖ హాలీవుడ్ టాబ్లాయిడ్ 'ది హాలీవుడ్ రిపోర్టర్' రమా గరించి కథనం వివరిస్తుంది. 'నాటు నాటు' పాట కోసం వినియోగించిన సూట్ లు...డ్రెస్ ల ఎంపిక వెనుక రమా రాజమౌళి ఉందన్నారు. అలాగే పాతకాలపు బ్రిటీష్ 1920ల ట్రెండ్ అవుట్ ఫిట్లు.. ఆనాటి రాజసం ఉట్టిపడేలా అంత గొప్పగా పాట వచ్చిందంటే? దాని వెనుక రమ ప్రతిభను ప్రోత్సహించాల్సిఏంద అని కీర్తించింది.భారతదేశంలోని బ్రిటిష్ కాలం నాటి పురుషులు - మహిళల కోసం 100ల బాల్ గౌన్లు - సూట్లు అంతే అవసరం సరిగ్గా గెస్ చేసారంటూ రాసుకొచ్చింది. సూట్ల గురించి స్పందిస్తూ... ఎన్టీఆర్ -చరణ్ల సూట్లను బ్రీతబుల్ మరియు ర్నింక్ల్ ఫ్రెంచ్ టెర్రీ కాటన్లో డిజైన్ చేశారని కథనం పేర్కొంది.



# కోహ్లీ, పంత్ 125 పరుగులు చేస్తారు! వారిద్దరూ 10 వికెట్లు తీస్తారు..



బంగ్లాదేశ్‌తో వన్డే సిరీస్‌కు దూరమైన టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్.. తిరిగి టెస్టు సిరీస్‌తో ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. ఇక గత కొంత కాలంగా వైట్‌బాల్ క్రికెట్‌లో పంత్ దారుణంగా విఫలమవుతున్నాడు.ఈ నేపథ్యంలో పంత్ కనీసం ఈ టెస్టు సిరీస్‌తోనైనా తిరిగి ఫామ్‌లోకి రావాలని అతడి అభిమానులు కోరుకుంటున్నారు.ఇక బంగ్లాదేశ్-భారత మధ్య తొలి టెస్టు ఛాటోగ్రామ్ వేదికగా బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్ ఆకాష్ చోప్రా తన అంచనాలను అభిమానులతో పంచుకున్నాడు. బంగ్లాతో తొలి టెస్టులో విరాట్ కోహ్లీ, పంత్ కలిసి కనీసం 125 పరుగులు చేస్తారని ఆకాష్ చోప్రా జోస్యం చెప్పాడు.తన యూట్యూబ్ ఛానల్‌లో చోప్రా మాట్లాడుతూ.. :"బంగ్లాదేశ్ తొలి టెస్టు మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ, రిషబ్ పంత్ రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి కనీసం 125 పరుగులు చేస్తారని నేను భావిస్తున్నాను. పంత్ పూర్తి ఫిట్‌గా ఉన్నాడు. కాబట్టి జట్టులో ఖచ్చితంగా ఉంటాడు.అదే విధంగా రవిచంద్రన్ అశ్విన్, అక్షర్ పటేల్ కలిసి 10 లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు పడగొడతారని నేను అనుకుంటున్నాను. ఓవరాల్‌గా రెండు ఇన్నింగ్స్‌లోనూ బంగ్లాదేశ్ ఆలౌట్ అవుతుంది. ఆ 20 వికెట్లలో వీరిద్దరూ కలిసి కచ్చితంగా 10 వికెట్లు సాధిస్తారు" అని అతడు పేర్కొన్నాడు.

# పాక్‌లో బాబర్ ఆజమ్ కంటే కోహ్లీకే క్రేజ్ ఎక్కువ.. ఇది చూడండి..!

టీమిండియా స్టార్ క్రికెటర్, రన్ మెషీన్ విరాట్ కోహ్లీకి ఈ ప్రాంతం ఆ ప్రాంతం అన్న తేడా లేకుండా విశ్వవ్యాప్తంగా అభిమానులు ఉన్న విషయం తెలిసిందే.కింగ్‌కు దాయాది దేశం పాక్‌లోనూ భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందన్న విషయం మరోసారి నిరూపితమైంది. ముల్తాన్ వేదికగా పాకిస్తాన్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన రెండో టెస్ట్ సందర్భంగా ఇద్దరు పాక్ అభిమానులు కోహ్లీపై ఉన్న అభిమానాన్ని వినూత్నంగా చాటుకున్నారు.వచ్చే ఏడాది జరగనున్న ఆసియా కప్‌లో ఆడేందుకు కోహ్లీ పాక్‌కు రావాలని ప్లకార్డ్‌లు పట్టుకుని మరీ విన్నవించుకున్నారు. కింగ్ కోహ్లీ పాక్‌కు వచ్చి ఆసియా కప్ ఆడాలని మొరపెట్టుకున్నారు. ఓ అభిమాని అయితే.. మా కింగ్ బాబర్ ఆజమ్ కంటే నిన్నే ఎక్కువ ఇష్టపడతాం అంటూ కోహ్లీపై అభిమానాన్ని చాటుకున్నాడు. దీనికి సంబంధించిన ఫోటో నెట్టింట వైరలవుతుంది.ఇదిలా ఉంటే, వచ్చే ఏడాది పాక్‌లో జరిగే ఆసియా కప్‌లో ఆడేది లేదని భారత్ ఇదివరకే స్పష్టం చేసింది. ఇందుకు ప్రతిగా పాక్.. తాము సైతం భారత్‌లో జరిగే వన్డే ప్రపంచకప్‌లో ఆడేది లేదని బెదిరింపులకు దిగింది. పాక్ ఉడత బెదిరింపులకు భయపడేది లేదని, ఆ దేశంలో ఎట్టి పరిస్థితుల్లో అడుగుపెట్టేది లేదని భారత వర్గాలు తెగేసి చెప్పడంతో పాక్ తోకముడిచి ఆ ప్రస్తావనకు తాత్కాలికంగా బ్రేక్ వేసింది.ఈ నేపథ్యంలో పాక్‌కు చెందిన అభిమానులు కోహ్లీ కోసం, టీమిండియా పాక్‌లో ఆడటం కోసం చేసిన విన్నపం క్రికెట్ సర్కిల్స్‌లో చర్చనీయాంశంగా మారింది. కొందరు ఆటను ఇతర విషయాలతో ముడిపెట్టడం సబబు కాదని, ఆటను ఆటలా చూసి పాక్‌లో క్రికెట్ ఆడాలని కోరుతున్నారు. అక్కడ కూడా కోహ్లీకి వీరాభిమానులు ఉన్నారు.. వారు కింగ్ ఆటను ప్రత్యక్షంగా వీక్షించేందుకు తపిస్తున్నారంటూ సోషల్‌మీడియాలో కామెంట్లు చేస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190